ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
ఆదివారం 3 ఆగస్టు 2025



ఎన్నోఏళ్ల కల.. నెరవేరిన వేళ!

● కానిస్టేబుళ్ల పోస్టులకు ఎంపికైన యువతలో ఆనందం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మూడేళ్ల క్రితం (2022) నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక పరీక్షను నిర్వహించి ఫలితాలు విడుదల చేసి నిరుద్యోగుల్లో ఆశలు రేపింది. రోజులు గడుస్తున్నా కనీసం దేహదారుఢ్య పోటీలూ నిర్వహించలేదు. ఇక ఈ ప్రక్రియ ఈ నోటిఫికేషన్ ముందుకు సాగేది లేదని భావించిన ఎంతో మంది నిరుద్యోగులు ప్రైవేటు ఉద్యోగాలు, ఇతర ఉపాధి అవకాశాలను వెతుక్కున్నారు. అయితే, గతేడాది అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో నిరుద్యోగుల ఆశలను నెరవేరుస్తూ 2022లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్ ప్రక్రియను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసింది. దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేసి మెయిన్స్ పరీక్షలు నిర్వహించి ఈ నెల 1వ తేదీన తుది ఫలితాలను విడుదల చేసి ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 158 మంది కానిస్టేబుల్ పోస్టులు సాధించారు. ఇక రావనుకున్న ఉద్యోగాలు తమ తమ దరిచేరడంతో ఆ నిరుద్యోగుల సంబరాలు అంబరాన్ని తాకాయి. వారిలో కొందరు తమ ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నా కల నెరవేరింది!



నాది గూడూరు మండలం నెర్నూరు. తల్లిదండ్రులు సూరాబత్తిన రామచంద్రయ్య, దొరశానమ్మ కూలి పనులు చేసుకుంటూ డిగ్రీ వరకు చదివించారు. సమాజంలో మహిళలను చిన్న చూపు చూడటం, మహిళలకు ఉద్యోగాలు అవసరమా అన్న మాటలు వింటూ పెరిగాను. ఎలాగైనా పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. 2022లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకు నోటిఫికేషన్ విడుదల అయ్యింది. దరఖాస్తు చేసుకొన్న కొద్ది రోజులకు ప్రాథమిక పరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. ఆ తర్వాత కోర్టు కేసులు, ఏవేవో కారణాలతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే దేహదారుఢ్య, మెయిన్స్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేయడం ఆనందంగా ఉంది. నా భర్త ఎన్ చక్రవర్తి, అత్తమామలు, తల్లిదండ్రుల సహకారంతో నేను ఈ ఉద్యోగం సాధించాను.

- ఎస్.వసంత, గూడూరు

నమ్మకం కోల్పోలేదు!



నెల్లూరులోని వెంగళరావునగర్ మాది. నాన్న అంకయ్య కార్మిక శాఖలో ఉద్యోగం చేస్తూ రిటైర్డ్ అయ్యారు. అమ్మ శంకరమ్మ ఇంట్లోనే ఉంటారు. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని 2018 నుంచి ప్రయత్నిస్తున్నాను. 2022లో నోటిఫికేషన్ విడుదల చేసినా ప్రాథమిక పరీక్ష మాత్రమే నిర్వహించి వదిలేశారు. ఇక ఈ ఉద్యోగాలు భర్తీ చేయరని అందరూ నమ్మకం కోల్పోయారు. నేను మాత్రం ఖచ్చితంగా ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకంతో ఉన్నాను. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్వరలోనే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారని ఆశించాను. అయితే సంవత్సర కాలంలోనే ఉద్యోగంలో చేరేలా చర్యలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.

- బండారు చంద్రబాబు, నెల్లూరు

నా కలను ప్రభుత్వం నెరవేర్చింది!



దగదర్తి మండలం నారాయణపురంలో నా తల్లిదండ్రులు వెంకయ్య, రత్నమ్మ వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. మాది చాలా పేద కుటుంబం కావడంతో చిన్నతనం నుంచే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంతో చదువుకున్నాను. 2022లో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ కావడంతో ఎంతో ఆనందంగా దరఖాస్తు చేసుకున్నాను. ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత కావడంతో దేహదారుఢ్య పరీక్షలపై దృష్టి సారించాను. అయితే, సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నోటిఫికేషన్‌ను కొనసాగిస్తారా!? అన్న భయం ఏర్పడింది. అయితే సంవత్సరంలోనే అన్నీ పూర్తి మా కలను ప్రభుత్వం నెరవేర్చింది.

- పోట్లూరి వెంకటేశ్వర్లు, దగదర్తి

అమ్మానాన్న, అన్న కష్టం.. ఈ ఉద్యోగం



మాది విడవలూరు మండలం ముదివర్తి గ్రామం. మా తల్లిదండ్రులు శీనయ్య, జ్యోతి వ్యవసాయ పనులు చేసుకుంటారు. నేను కబడ్డీలో జాతీయ క్రీడాకారుడ్ని. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలని నా కల. అందుకోసం తల్లిదండ్రు లు, అన్న వంశీకృష్ణ వ్యవసాయ కూలి పనులు చేస్తూ నన్ను ఉద్యోగ ప్రయత్నాల్లో ముందుకు తీసుకెళ్లారు. వారి కృషి ఫలితంగానే ఇప్పుడు కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాను. చాలా ఆనందంగా ఉంది.

- పట్టపు సాయికుమార్, విడవలూరు

ఊపిరి పీల్చుకున్నా...!



మాది మధ్య తరగతి కుటుంబం. నెల్లూరులోని కోటమిట్ట ప్రాంతంలో నాన్న షేక్ రఫీ ఆటో మెకానిక్, తల్లి హసీనా. నాన్న మెకానిక్ పనులు చేసుకుంటూ మా కుటుంబాన్ని పోషిస్తున్నారు. 2022లో కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో నేను ఓ ప్రైవేటు కంపెనీలో వర్క్‌ఫర్ హోం ఉద్యోగం చేస్తున్నాను. తల్లిదండ్రుల అంగీకారంతో కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేశాను. ప్రాథమిక పరీక్షలో క్వాలిఫై కావడంతో చేస్తున్న ఉద్యోగం మానేసి పూర్తిగా కానిస్టేబుల్ ఉద్యోగంపైనే దృష్టి పెట్టాను. కానీ రోజులు గడుస్తున్నా ఆ తర్వాత ప్రక్రియ జరగలేదు. చేస్తున్న ఉద్యోగం ఎందుకు మానేశానా అని బాధపడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే దేహదారుఢ్య పోటీలు నిర్వహించి ఫలితాలు విడుదల చేయడం, మెయిన్స్ నిర్వహించి ఫలితాలు విడుదల చేయడం అంతా ఓ కలలా ఉంది.

- షేక్ అస్మా, నెల్లూరు

కళాశాల స్థాయి నుంచే ఆసక్తి



పొదలకూరు రామమందిరం వీధిలో మేం ఉంటున్నాం. నాన్న సోమా రామకృష్ణయ్య. అమ్మ లలితమ్మ. మా నాన్న కూలి పనులు చేస్తుంటారు. చిన్నప్పుడే పోలీసు కావాలని నిశ్చయించుకున్నాను. పొదలకూరులో డిగ్రీ పూర్తి చేశాక కాకినాడకు వెళ్లి కానిస్టేబుల్ పరీక్షలకు శిక్షణ పొందాను. పట్టుదలతో శ్రమించి 140 మార్కులతో జిల్లాస్థాయిలో 18వ ర్యాంకు సాధించాను. ఒకవైపు పేదరికం వెంటాడుతున్నా.. తల్లిదండ్రులు, సోదరుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతున్నాను.

- సోమా పెంచలస్వామి, పొదలకూరు

ఏడేళ్ల కల నెరవేరింది!



మేము 30 ఏళ్లుగా పొదలకూరులోని టైలర్స్ కాలనీలో ఉంటున్నాం. నాన్న కరీముల్లా కార్పెంటర్. అమ్మ అషరున్నీసా గృహిణి. ప్రాథమిక విద్య తోడేరులో చదివాను. నెల్లూరులో డిగ్రీ పూర్తి చేశాను. 2018 పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్ష లో ఒక మార్కు తేడాతో నా పోస్టు చేజారింది. ఎలాగైనా కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాలని ఈసారి చాలా కష్టపడ్డాను. 135 మార్కులతో జాబ్ సాధించాను. దీంతో నా ఏడేళ్ల కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది.

- షేక్ దావూద్‌బాషా, పొదలకూరు


జిల్లాలో ముమ్మరంగా స్వామిత్వ సర్వే

నెల్లూరు (జడ్పీ) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రజలకు ఆస్తి హక్కు కల్పించేందుకు స్వామిత్వ రెండో విడత సర్వేను ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 337 పంచాయతీలు ఈ సర్వేకు ఎంపిక అయ్యాయని శనివారం నుంచి ఈ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారన్నారు. ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల ఇంటి కొలతలను తీసుకుని యాజమాన్యపు హక్కు కల్పించేందుకు ఆస్తి హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలతో పాటు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లోని గృహ యజమానులందరూ సర్వేకి సహకరించాలని కోరారు.

మరణించినా.. జీవించు!

అవయవదానంతో 8 మందికి పునర్జన్మ ● జిలాలో కిడ్నీ నేత్రదాతలే ఎక్కువ ● నేడు జాతీయ అవయవ దాన దినోత్సవం

'మనం చనిపోయాక కూడా పది మందికి ఉపయోగపడాలి. అప్పుడే ఈ జన్మకు సార్థకత ఉంటుంది.' అని పెద్దలు అంటుంటారు. అవును.. అది నిజమే. మనం మరణించినా మన కళ్లు ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి. మనం ఏ లోకంలో ఉన్నా మన మూత్రపిండాలు మాత్రం రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి. మన శ్వాస ఆగిపోయినా లబ్‌డబ్.. లబ్‌డబ్ అంటూ గుండె కొట్టుకుంటూనే ఉంటుంది. కేవలం అవయవదానం వల్ల మరణించినా బతికి ఉండే అవకాశాన్ని లభిస్తోంది. మృత్యువును జయించిన వారంతా దేవతలైతే... ఆ జాబితాలో అవయవాలను దానం చేసిన వారు కూడా చేరుతారు.



18 ఏళ్ల పైబడిన వారు తమ మరణానంతరం, ప్రమాద సమయాలలో బ్రెయిన్ డెత్‌కు గురైన వారు ఈ అవయవాలు దానం చేసి మరొకరికి పునర్జన్మనివ్వచ్చు. దేశవ్యాప్తంగా 1.50 లక్షల మంది అవయవాల కోసం వేచి చూస్తుండగా కేవలం 8వేల మంది మాత్రమే అవయవ దానం చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో అవయవ దానంపై విస్తృత ప్రచా రం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా నడుం బిగించింది. రాష్ట్రంలో జీవన్‌దాన్ సంస్థ కూడా ఈ ప్రచారాన్ని చేపడుతోంది. ఇప్పటికే అవయవాల కోసం రాష్ట్రవ్యాప్తంగా 4,733 మంది రోగులు జీవన్‌దాన్ సంస్థలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ జాబితాలో జిల్లావ్యాప్తంగా 300 మందికిపైగా ఉన్నారు. ఆదివారం జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

8లో..

ఎన్‌హెచ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీలు శనివారం విజయవాడ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. నెల్లూరు నగరంలో ఎన్‌హెచ్-67 (మినీ బైపాస్) అభివృద్ధికి రూ.15 కోట్లతో శంకుస్థాపన చేశారు. తొమ్మిది కిలోమీటర్ల మేర ఈ రోడ్డును ప్రస్తుతం బాగు చేస్తున్నారు. అలానే కావలి -జలదంకి మధ్య ఎన్‌హెచ్ 167బీజీ రోడ్డు అభివృద్ధికి రూ.17 కోట్లతోనూ, సీతారామపురం వద్ద ఎన్‌హెచ్ 167బీ రోడ్డు అభివృద్ధికి రూ.11 కోట్లతోనూ, ఇదే హైవేను వలేటివారిపాలెం, కందుకూరుల మధ్య అభివృద్ధి చేసేందుకు మరో రూ.10 కోట్లతో శంకుస్థాపనలు చేశారు.

35 టీఎంసీలకు చేరువైన సోమశిల

అనంతసాగరం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటినిల్వ 35 టీఎంసీలకు చేరువవుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 12,439 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రైతు కళ్లలో ఆనందం

'అన్నదాత సుఖీభవ' నగదు జమ

1,95,866 మందికి రూ.131.6 కోట్లు

మెసేజ్‌లు చూసుకుని మురిసిన పుడమిపుత్రుడు



'అన్నదాత సుఖీభవ' అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాలో తొలి విడతగా జమ చేసిన మొత్తం రూ.7 వేలు. రబీ ఆరంభానికి ముందే వ్యవసాయానికి పెట్టుబడి సాయం కింద ఈ మొత్తం అందడంతో పుడమి పుత్రులు మురిసిపోతున్నారు. గతం లో ఒక్కో రైతుకు ఏడాదికి రూ.13, 500 ఇస్తుండగా, ఇప్పుడు ఎన్డీఏ కూటమి హయాంలో రూ.6,500 పెంచి రూ.20 వేలు ఇవ్వనున్నారు. ఇందులో తొలివిడతగా రూ.7వేలు శనివారం విడుదల చేశారు. తమ ఖాతాల్లో డబ్బులు జమ అయినట్లు వచ్చిన మెసేజ్‌లను పదే పదే చూసుకొని సంబరపడిపోతున్నారు. కాగా, ఒక్కసారిగా నిధులు విడుదల చేయడంతో బ్యాంక్ సర్వర్లు మొరాయించడంతో ఆలస్యంగా మెసేజ్‌లు వస్తున్నాయి. అయితే, శనివారం రాత్రంతా కర్షకుల నోట అన్నదాత సుఖీభవ నిధుల జమకు సంబంధించిన మాటలే వినిపించాయి.



కోవూరులో చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతి తదితరులు



వింజమూరులో జేసీ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి బృందం) :ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈసారి అన్నదాతల గౌరవాన్ని రెట్టింపు చేసింది. వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో రాష్ట్ర వాటా కింద ఒక్కో రైతుకు ఏడాదికి 7500 రూపాయలు మాత్రం సాయం అందించేది. కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6వేలతో కలుపుకుంటే అప్పట్లో రైతుకు రూ.13,500 అందేది. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్ర వాటాను 7500 నుంచి 14 వేల రూపాయలకు పెంచారు. అంటే గతంతో పోల్చితే ఒక్కో రైతుకు రాష్ట్ర వాటా కింద 6,500 రూపాయల అదనపు సాయం అందిస్తున్నారు. ఆ మొత్తంలో తొలి విడత నగదు 7వేలు అన్నదాతా సుఖీభవ అంటూ శనివారం రైతుల ఖాతాల్లో జమ కావడంతో రైతుల్లో పండగ వాతావరణం నెలకొంది. జిల్లావ్యాప్తంగా 1,95,866 మంది రైతులకు రూ.131.6 కోట్ల నగదు కర్షకులకు చేరింది.

● చిన్నమొత్తమే అయినా..

ఒక విధంగా చూస్తే 7వేల రూపాయలు రైతుల విషయంలో చిన్న మొత్తమే. ఎందుకంటే వ్యసాయం కోసం ఏడాది కాలంలో అంతకు 20, 30 రెట్లు అధికంగా ఖర్చు చేస్తారు. ఇంత పెట్టుబడి పెట్టినా పంట అమ్మకాల సమయంలో అత్యధిక సార్లు నష్టమే చూస్తారు. కాయకష్టం కాటిలో కాలిపోయినా పెట్టుబడి కూడా చేతికందలేదని ఏటా కుమిలిపోతూనే ఉన్నాడు. ఏడాది సేద్యంలో ఒక్కపైసా పెట్టుబడి పెట్టకుండా లాభం రూపంలో రైతు చేతికందేది పెట్టుబడి సాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అన్నదాత సుఖీభవ మొత్తమే. అందుకే ఈ పెట్టుబడి సాయం అంటే రైతులకు అంత ఇష్టం. తమ పెట్టుబడిలో యాభయ్యోవంతు లేకపోయినా, ఏటా అనివార్యంగా ఎదురయ్యే నష్టంలో వందోవంతు మొత్తానికి సరిపోకపోయినా అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వాలు అందించే సాయాన్ని అన్నదాతలు గౌరవంగా గుర్తిస్తారు.

● కౌలు రైతులకు..

ఇక కౌలు రైతు కార్డులు (సీసీఆర్‌సీ) కలిగిన రైతులకు రబీ సీజన్‌లో తొలి విడతగా రూ.10వేలు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అదేవిధంగా అర్హత కలిగి సరైన పత్రాలు సమర్పించని వారు ఆయా పత్రాలను సరిచేసుకుంటే రెండో విడతలో వారికి నగదు సాయం అందుతుందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు.



వెంకటాచలంలో చిరుధాన్యాలతో వేసిన ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

● జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా...

రైతుభరోసా కింద విడుదలైన నగదుకు సంబంధించి నమూనా చెక్కులను జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అర్హులైన రైతులకు అందజేశారు. కోవూరులో కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చెక్కు పంపిణీ చేయగా, వింజమూరులో జేసీ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అందజేశారు. వెంకటాచలం మండలం ఎర్రగుంట గ్రామంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, కావలిలో ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, కందుకూరు మండలం పలుకూరు గ్రామంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఆత్మకూరులో టీడీపీ నాయకులు రైతులకు చెక్కులు అందజేశారు.

రైతులకు వరం



అన్న దాత-సుఖీ భవ పథకం రైతు లకు వరం. ఈ పథ కం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏడా దికి రూ.14 వేలు జమ చేస్తుండటం ఆనందదాయకం. మొదటి విడతగా రూ.5 వేలు నా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ నగదు పంటలు సాగులో ఎంతో ఉపయోగపడతాయి.

- అంగులూరి చిన కొండయ్య, మొగిలిచెర్ల, లింగసముద్రం

పెట్టుబడిలో కొంత భారం తగ్గినట్లే..



అన్నదాత సుఖీభవ పథ కంతో పెట్టుబడి సాయంలో కొంత భారం తగ్గినట్లు అయింది. కూట మి ప్రభుత్వం అన్నదాతలకు మేలు చేకూర్చే విధంగా ఏడాదికి రూ.20వేలు ప్రకటించి, ఇవ్వడం రైతులను పరోక్షంగా అప్పుల భారం నుంచి కొంతమేరకు దూరం చేసిందనే చెప్పాలి. శనివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన రూ.7000 బ్యాంక్ ఖాతాకు చేరాయి.

- దేవినేని వెంకటరమణయ్య, ఉలవపాడు

ఎంతో ఉపయోగం



ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పీఎం కిసాన్ రూ.2వేలతోపాటు అన్నదాత సుఖీభవ నగదు రూ.5 వేలు బ్యాంకు ఖాతాకు శనివారం జమ అయింది. తొలి విడతగా అందిన ఈ నగదు వ్యవసాయ ఖర్చులకు ఎంతో ఉపయోగపడతాయి.

- కోటు అనీల్ కుమార్‌రెడ్డి, సంగం

పంటల సాగుకు ఊతమిచ్చింది



కరువు సీమలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన పెట్టుబడి సాయం పంటల సాగుకు ఊతమిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 మాత్రమే చెల్లిస్తే చంద్రబాబు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు ఇవ్వడం ఆనందంగా ఉంది. ఈ నగదు కరువు ప్రాంతాల రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

- భోగినేని మూడవ కాశయ్య, సీతారామపురం

ఇది రైతు ప్రభుత్వమే!



అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అందిక ఆర్థిక సాయం సాగుకు చేయూత ఇవ్వడమే. మా కుటుంబం కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. వ్యవసాయానికి మరింత సాయాన్ని అందించి బాసటగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమే అని నిరూపించుకుంది.

- మద్దిబోని శ్రీను, రైతు, అల్లూరు

'ఎడగారు' ఖర్చులకొచ్చాయి



మా ఊళ్లో మా కుటుంబానికి 1.30 ఎకరా పొలం ఉంది. దాంట్లో ఈ ఎడగారికి కేఎన్‌ఎం రకం వరి సాగు చేశాం. ఈ రోజున ప్రభుత్వం ఇచ్చిన అన్నదాత సుఖీభవ డబ్బులు పంట పెట్టుబడి ఖర్చులకు వచ్చాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబు పార్టీ వాళ్లు ఇస్తామన్నారు. పంట పెట్టుబడికి అప్పు చేయకుండా సరిపోయింది.

-దండు రమణమ్మ, సౌత్‌మోపూరు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది. అందులో భాగంగా అన్నదాత సుఖీభవ కింద ఏడు వేల రూపాయలు బ్యాంకు ఖాతాలో జమ కావటం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారు.

- పొలిరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, చౌకిచర్ల, విడవలూరు మండలం

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మాది వ్యవసాయకుటుంబం. ఎకరా పొలం ఉంది. ప్రతీ ఏటా వరి సాగు చేసుకుంటాం. ఇవాళ నాకు 'అన్నదాత సుఖీభవ పథకం' కింద రూ. 5వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేలు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది. ఈదఫా మునుపటి కంటే ఎక్కువ ఇస్తారంట కదా. పైరు పెట్టేటప్పుడు ఈ డబ్బులు ఆదుకుంటాయి. మంచిదే.. రైతుల కోసం ప్రభుత్వాలు సాయం చేస్తున్నందుకు కృతజ్ఞతలు చెబుతున్నా.

- పోలంరెడ్డి రమణమ్మ, మనుబోలు

విద్యతోపాటు ఆటలూ అవసరం

కొడవలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు చిన్నారులకు ఆటపాటలు అవసరమని జ్ఞానవిజ్ఞాన కళాకారుడు నాగరాజు అన్నారు. పద్మనాభ సత్రం ప్రభుత్వ పాఠశాలలో కొడవలూరు జనవిజ్ఞాన శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాగరాజు విద్యార్థులకు ఆటపాటలతో పాటు పేపర్ కటింగ్‌తో బొమ్మలు తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పార్వతీశం, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9569
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ. 117.20

పెంచలస్వామి కల్యాణం



విరాళం అందజేస్తున్న పెంచలనరసింహులు

రాపూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శ్రీవారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున చందనాలంకార సేవ చేశారు. ఊంజల్ సేవ, క్షేత్రోత్స వం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, అన్న ప్రసాదం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ పి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

శాశ్వత నిత్యాన్న పథకానికి రూ.లక్ష విరాళం

పెంచలకోన శాశ్వత నిత్యాన్నదాన పథకానికి చేజర్ల మండలం మందపల్లికి చెందిన ముళ్లపుట్టి పెంచలనరసింహులు, హేమలత దంపతులు ఈవోకు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. దాత కుటుంబానికి స్వామివారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విడవలూరులో నేత్రదానం

విడవలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విడవలూరుకు చెందిన నాశిన కృష్ణయ్య (74) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబసభ్యుల అనుమతి మేరకు మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మృతుడి నేత్రాలను దానం చేశారు.

శభాష్.. పోలీస్!

మనుబోలు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో ఆస్పత్రికి వెళ్లడానికి వాహనం దొరక్క శనివారం అర్ధరాత్రి ఇబ్బంది పడుతున్న గర్భిణిని అటుగా వెళుతున్న ఆటోని ఆపి గస్తీ పోలీసులు పంపించారు. కేఆర్‌పురం దళితవాడకు చెందిన దాసరి సహదేవమ్మకు పురిటినొప్పులు వచ్చాయి. దీంతో 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో హైవేపైకి వచ్చారు. గస్తీ కాస్తున్న పోలీసులు మణి, హోంగార్డులు బాలాజీ, శ్రీకాంత్‌లు పేపర్ ఆటోను ఆపి ఆమెను అందులో ఎక్కించి గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీంతో సహదేవమ్మ కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

పెన్నాఘాట్‌కు గుర్రపుడెక్క ముప్పు

జలవనరుల శాఖ నిర్లక్ష్యం

నగరానికి పొంచి ఉన్న ముప్పు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరానికి గుర్రపుడెక్క ముప్పు తీవ్రంగా ఉంది. లక్షలు ఖర్చు చేస్తున్నా వదలని గుర్రపుడెక్క ఆకు ఇటీవల స్వర్ణాల చెరువులో రొట్టెల పండుగ సందర్భంగా పెను ముప్పుగా మారింది. ఇరిగేషన్, నగర పాలక సంస్థ ఇంజ నీర్లు గుర్రపుడెక్క సమస్యపై తలలు బాదుకుంటు న్నారు. తాత్కాలికంగా తొలగించి 'మమ' అనిపించారు. ఈనెల 27 నుంచి గణేష్ ఉత్సవాలు నగరంలో ప్రారం భమవు తున్నాయి. అదే స్వర్ణాల చెరువులో మూలాపేట గణేష్ ఘాట్‌లో గుర్రపుడెక్క సమస్య తీవ్రంగా ఉంది. దానిని తొలగించి గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేయాలంటే చెరువు నీటిమట్టం పెంచాలి. అలాగే ఘాట్, నెక్లెస్‌రోడ్డు మరమ్మతులు, మౌలిక వసతులకు నుడా రూ.80 లక్షలు మంజూరు చేసింది. అయితే అక్కడ పనులు అంత వేగంగా జరగడంలేదు. నిత్యకళ్యాణం పచ్చ తోరణంగా తల్పా గిరి రంగనాథస్వామి అభిషేకానికి అవసరమైన పెన్నా జలాలు తీసుకురావడానికి పెన్నా ఘాట్‌లో పేరుకు పోయిన గుర్రపుడెక్క ఇబ్బందికరంగా మారింది. స్వామి వారికి అవసరమైన అభిషేక తీర్థాన్ని గుర్రపు డెక్క తొల గించుకొని అర్చకులు తీసుకువస్తున్నారు.



రంగనాథుడి మెట్లరేవులో పేరుకుపోయిన గుర్రపు డెక్క



స్నానానికి అనువుగా లేక ఇబ్బంది పడుతున్న యాత్రికులు

రోజూ ఇదే సమ స్యతో అర్చకులు ఇబ్బంది పడుతున్నారు.

● జలవనరుల శాఖ నిర్లక్ష్యం..

తల్పగిరి రంగనాథస్వామి ఘాట్ నుంచి పెన్నా బ్యారేజీ వరకు పచ్చని హరితవనంగా గుర్రపుడెక్క కనువిందు చేస్తుంది. కానీ దీనివల్ల పెద్ద ప్రమాదం పొంచివుంది. ఇరిగేషన్ అధికారులు గుర్రపుడెక్క నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం పట్ల నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరదలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెన్నానదికి కూడా వరదలు వస్తే గుర్రపుడెక్క కారణంగా నీరు కిందకు వెళ్లకుండా పొర్లుకట్టను ఢీకొంటుంది. ఫలితంగా నగరం ముంపునకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. పెన్నానదిలో ఘాట్ వద్ద రంగనాథ ఆలయానికి వచ్చే యాత్రికులు, నగరవాసులు పెన్నానదీ జలాల్లో పవిత్ర స్నానాలు ఆచరించాలంటే గుర్రపుడెక్క ఆకుతో ఇబ్బందులుపడుతున్నారు. నది అంచున నిలబడి స్నానాలు చేయాలన్నా వీలుకానంతగా గుర్రపు డెక్క విస్తరించింది. దీంతో భక్తులు చేసేదిలేక పవిత్ర జలాలను తలపై చల్లుకొని స్వామిని దర్శించుకుంటున్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించి పెన్నానదిలో గుర్రపుడెక్కను నిర్మూలించి, నగరాన్ని ముంపు గండం నుంచీ గట్టెక్కించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన వైసీపీకి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న కమ్యూనిటీ హాలులో శనివారం 'అన్నదాత సుఖీభవ' పీఎం కిసాన్ తొలివిడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులతో కలిసి ఎమ్మెల్యే సోమిరెడ్డి సైతం పంచె కట్టుకుని రాగా, రైతులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సర్వేపల్లిలో ఈ పథకంతో 28 వేల రైతు కుటుంబాలకు మూడు విడతల్లో రూ.56 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు. జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 1.95 లక్షల మంది రైతులు రూ.131 కోట్లు లబ్ధి పొందారన్నారు. మూడు విడతలు కలిపి జిల్లాలోని రైతుల ఖాతాలలో రూ.380 కోట్లకుపైగా జమ కానుందన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.6 వేలకు రూ.14 వేలు కలిపి రూ.20 వేలు అందిస్తోందన్నారు. సోమశిల జలాశయానికి రోజుకి ఒక టీఎంసీ కృష్ణా జలాలు వస్తుండడం శుభ పరిణామన్నారు. ఈ ఏడాది కూడా సోమశిల తో పాటు కండలేరు జలాశయాలను పూర్తి సామర్థ్యంతో నింపి రెండు పంటలకు నీళ్లు అందిస్తామన్నారు. ఏపీ దేశీయ జలమార్గ ప్రాధికార సంస్థ ఛైర్మన్ డాక్టర్ జెడ్ శివప్రసాద్, నేతలు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, రావూరి రాధా కృష్ణమనాయుడు, బొమ్మి సురేంద్ర, చల్లా నాగార్జున్ రెడ్డి, గాలి రామకృష్ణారెడ్డి, వలి పి మునుస్వామి, అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రైతు సాయం ప్రభుత్వానికి భారం కాదు

కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పక్కన జిల్లా కలెక్టర్ ఆనంద్

కోవూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు సహాయం చేయడం ప్రభుత్వానికి భారం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తించారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక పీవీఆర్ కళ్యాణ మండపంలో శనివారం వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన సభలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఆమె జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం కింద 16,938 మంది రైతుల అకౌంట్లలో రూ. 11,6,94000 జమ అయిందన్నారు. నగదు జమకాని రైతులకు ఆర్థిక సహా యం అందేలా వ్యవసాయశాఖ సిబ్బంది, టీడీపీ నాయకులు కృషి చేయా లన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వరి అమ్మిన 48 గంటల్లోనే రైతులకు నగదు అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, ఎంపీపీ పార్వతి, పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల రెడ్డి, సర్పంచు యాకసిరి విజయమ్మ, బుచ్చిరెడ్డిపాళెం నగరపంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కోడూరు ప్రభాకరరెడ్డి, రావెళ్ళ వీరేంద్ర, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, బీజేపీ నాయకుడు రాఘవేంద్ర, జనసేన నాయకుడు చప్పిడి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1,95,866 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ

'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా జిల్లాలో 1,95,866 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలిపారు. నగదు జమకాకపోతే టోల్‌ఫ్రీ నెం 155251కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. సంబంధిత సచివాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతీ రైతు ఖాతాలో తొలివిడతగా ప్రభుత్వం రూ 7000 జమ చేసిందన్నారు.

నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు

వెంకటాచలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఏపీ పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని గొలగమూడి వద్ద ఉన్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. సౌకర్యాలను అడిగి తెలుసుకుని పిల్లలతోపాటు అక్కడే భోజనం చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పరిశ్రమల భాగస్వామ్యంతో సర్వేపల్లి అభివృద్ధి

ముత్తుకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల భాగస్వామ్యంతో సర్వేపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం తాళ్లపూడిలో పర్యటించిన ఆయన నియోజకవర్గంలోని ఏ కంపెనీ అయినా సీఎస్ఆర్ నిధులను తమ ప్రాంతంలో ఖర్చు పెట్టాల్సిందేనన్నారు. జెమినీ ఎడిబుల్ అయిల్ కంపెనీతో పాటు అదానీ కృష్ణపట్నం పోర్టు, ఎస్ఈఐఎల్ ఎనర్జీ కంపెనీలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రోడ్ల నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.6కోట్లను సర్వేపల్లికి మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ నాయకులు నీలం మల్లికార్జున యాదవ్, రవికుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

పొదలకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ కిరణ్ రిషిత పాల్గొన్నారు. ఏఎన్ఎం కామాక్షమ్మ, పెంచలమ్మ, సచివాలయ ఏఎన్ఎం మమత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. బత్తులపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

కోవూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాళెంలో శుక్రవారం ఈత సరదా ఓ యువకుడి ప్రాణం బలితీసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పోతిరెడ్డిపాళెంకు చెందిన మేకల సురేష్ (28సం) శుక్రవారం పల్లి పాళెం సమీపంలో పెన్నానదిలోకి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్ళాడు. అయితే పెన్నానది ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు ఆయన కొట్టుకుపోయాడు. స్థానికులు, పోలీసులు శనివారం ఉదయం డ్రోన్ కెమె రాలతో పరిశీలించగా నీటిపై తేలి యాడుతున్న మృత దేహాన్ని గుర్తించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు సురేష్ ఐటీడీపీ మండల కమిటీ అధ్యక్షుడుగా టీడీపీ కార్యక్ర మాల్లో చురుగ్గా పాల్గొనేవాడు.

బస్సు ఢీ : యువకుడి మృతి

ముత్తుకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నుంచి ముత్తుకూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు, ఎదురుగా వచ్చిన మోటార్ బైకును ఢీకొనడంతో వెంకట కార్తీక్ (17) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. శ్రీరాముల హర్షవర్ధన్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తర లించారు. ముత్తుకూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● చికిత్స పొందుతూ కార్మికుడు...

ముత్తుకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం పోర్టులోని పెన్నా సిమెంట్స్ పరిశ్రమలో శనివారం ప్రమాదం జరిగింది. ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడడంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రత్నేష్(25) పెన్నా సిమెంట్ పరిశ్ర మలో నిర్మాణంలో ఉన్న భవనంపై వెల్డింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. గాయాలపాలైన రత్నేష్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రత్నేష్ మృతి చెందాడు. ఈ మేరకు కృష్ణపట్నం ఎస్ఐ జేపీ శ్రీనివాసు లు రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు (విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : డిప్లొమో కోర్సుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.యేసుదాసు ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ఎలాంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉండదని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వారు టెన్త్ మార్క్ లిస్ట్, టీసీ, కులధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్ జెరాక్స్‌లతోపాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈ నెల 4వతేదీ సాయంత్రంలోపు దరఖాస్తులు అందించాలని తెలిపారు. 5వ తేదీన కళాశాలలో రూ.6వేలు ఫీజు చెల్లించి సీటు పొందాలని తెలిపారు.

ఎకరా కూడా ఎండనివ్వం!

విడవలూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్రన్ ఛానల్ కాలువ కింద ఒక్క ఎకరా కూడా ఎండకుండా చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుం టున్నామని ఈస్ట్రన్ ఛానల్ డీసీ ఛైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి తెలిపారు. ఈస్ట్రన్ ఛానల్ 4వ మైలు వద్దనున్న తూములను శనివా రం ఆయన ఇరిగేషన్ ఏఈ సురేష్‌తో కలసి పరిశీలించారు. చెత్త, గుర్రపు డెక్కను సొంత నిధులతో తీయించారు. ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యంరెడ్డి పాల్గొన్నారు.

కిరీటాల వితరణ

మనుబోలు, ఆగస్టు 2 (ఆంధ్ర జ్యోతి): స్థానిక అంబేడ్కర్ నగర్‌లో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయానికి శనివారం దాతలు రాళ్ల కిరీటాలు అందజేశారు. ఆలయ అర్చకులు స్వామి, దేవేర్లకు అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాలకు మనుబోలుకు చెందిన కోసూరు కోటేశ్వరగౌడ్, జగదీష్ గౌడ్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యువత విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కోవూరు ఎమ్మె ల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు ప్రాంగణంలో ఛైర్‌పర్సన్ ఆధ్వర్యం లో జిల్లా స్థాయి కబడ్డీ ఇన్విటేషన్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. రెండురోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో జిల్లా నలూమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

● తాగునీటి సమస్య తీర్చాకే మీ ఊరికొచ్చాను.

బుచ్చి నగర పంచాయతీలోని 1వార్డు కట్టుబడిపాళెంలో తాగునీటి సమస్య తీర్చాకే మీ వద్దకు వచ్చానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్థానికులతో అన్నారు. సీఎస్ఆర్, వీపీఆర్ ఫౌండేషన్ రూ. 31.76 లక్షలతో తాగునీటి బోరు, పైపులైన్లు పూర్తి చేసిన వాటర్‌ప్లాంట్‌ను స్థానిక కౌన్సిలర్ కత్తి నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఐసీడీఎస్ రూ.14 లక్షల జడ్పీపీ నిధుల తో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ అర్బన్, రూరల్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, కిషోర్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, సోదల రమణయ్య, కోదండరామిరెడ్డి, మోర్ల మురళి, సురేష్, తదితరనాయకులు పాల్గొన్నారు.

చేనేత క్లస్టర్‌ను పరిశీలించిన కేవీ శేషయ్య

కోవూరు, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): పాటూరులో ఏర్పాటు చేసిన చేనేత క్లస్టర్‌ను చేనేత ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శేషయ్య శనివారం పరిశీలించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి చేనేతల క్లస్టర్‌కు రూ 76 లక్షల నిధుల్ని మంజూరుచేయించడం అభినందనీయమన్నారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు బడతల ప్రభాకర్‌రావు, కోలాటి రాజేష్ , నాగరాజు, హరీష్, మధు తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న యాచకురాలిపై దూసుకెళ్లిన కారు

● అక్కడికక్కడే దుర్మరణం



గురవమ్మ మృతదేహం

కావలిరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కావలి రైల్వేస్టేషన్ ఆవరణలో నిద్రిస్తున్న ఓ యాచకురాలిపై గుర్తు తెలియని ఓ కారు దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. వ్యసనాలకు బానిసైన పర్తాపు గురవమ్మ(21) భిక్షాటన చేస్తూ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిద్రిస్తుండేది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి స్టేషన్‌లోని ఆటోస్టాండ్ సమీపంలో ఆరుబయట నిద్రిస్తుండగా స్టేషన్ నుంచి బయటకు వెళ్తున్న ఎరుపు రంగు కారు ఆమెను తొక్కుకొంటూ వెళ్లిపోయింది. దీంతో తీవ్రగాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానిక ఆటో డ్రైవర్ల ద్వారా తెలుసుకున్న ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉదయగిరిలో చోరీ

ఉదయగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కరీమావీధిలో గల ఓ నివాసంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు ధ్వంసం చేసి పది సవర్ల బంగారు నగలు, రూ.30 వేల నగదు అపహరించిన సంఘటన శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరీమావీధికి చెందిన మీరా మొహిద్దీన్, షేక్ సుభానిఖాదరున్నీసా భార్యాభర్తలు. మీరామొహిద్దీన్ బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లగా భార్య ఒక్కటే ఉంటోంది. ఈ తరుణంలో రోజులాగే సుభాని ఖాదరున్నీసా పట్టణంలోని తన బంధువుల నివాసంలో నిద్రపో యేందుకు వెళ్లింది. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు గోడ దూకి ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం బెడ్‌రూం గది తాళాలు పగలగొట్టి లోపల ఉన్న బీరువా తాళాలు తీసి అందులో ఉన్న గాజులు, కమ్మలు, ఉంగరాలు, ముక్కుపుడకలు తదితర బంగారు వస్తువులు సుమారు పది సవర్లు, వెండి వస్తువులతోపాటు రూ.30 వేల నగదు దోచుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన సుభానిఖాదరున్నీసా చోరీ జరిగిందని గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చింది. వారు విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో నివాసానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం నివాసంలో వేలిముద్రలను సేకరించారు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్ చోరీపై నగరంలోని చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదుచేశారు. పోలీసుల సమాచారం మేరకు, తిప్పరాజు వారివీధిలో ఆర్ రమేష్‌బాబు నివాసం ఉంటున్నారు. ఆయనకు పల్సర్‌బైక్ ఉంది. గత నెల 18 రాత్రి తన బైక్‌ను ఇంటిముందు పార్క్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించుకుని వెళ్లారు. ఈ మేరకు బాధితుడు శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి నగదు దోచేశారు!

నెల్లూరు(క్రైం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం కార్డును మార్చేసి ఖాతాలోని నగదును గుర్తుతెలియని దుండగుడు దోచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, నగరంలోని వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన జ్యోతికి నిప్పో సెంటర్‌లోని ఎస్‌బీఐలో ఖాతా ఉంది. గతనెల 24న ఆమె భర్త వెంకటేష్‌తో కలిసి ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు నగదు డ్రా చేసి ఇస్తానని వారి ఏటీఎం కార్డును తీసుకుని పిన్‌నెంబర్ తెలుసుకున్నాడు. అనంతరం నకిలీ ఏటిఎం కార్డును వారికి ఇచ్చి పనుందంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికే బ్యాంకు ఖాతా నుంచి రూ.15 వేల నగదు డ్రా అయినట్లు జ్యోతి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితులు శనివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగల చోరీపై ఫిర్యాదు

ఉదయగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తన బ్యాగులో ఉంచిన బంగారు నగలు చోరీకి గురయ్యాయని వరికుంటపాడు మండలం జడదేవి గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ పులివర్తి రామన్‌జ్యోతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు.. విధుల్లో భాగంగా గతనెల 23న రామన్‌జ్యోతి తెల్లవారుజామున స్వగ్రామం నుంచి విజయవాడ బస్సెక్కి ఉదయగిరికి బయలుదేరింది. బస్సు దిగి డ్యూటీకి వెళ్లేందుకు సిద్ధమై బ్యాగును పరిశీలించగా అందులో ఉన్న బంగారు సరుడు, తాళిబొట్టు కనిపించలేదు. చోరీకి గురయ్యాయని తెలుసుకుని అప్పట్లో పోలీసులకు ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ సూచించింది. పోలీసులు అతన్ని విచారించగా ఏమీ తేలలేదు. అనంతరం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ముసునూరు వద్ద కారు, లారీ ఢీ

● త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



లారీ ఢీకొనడంతో డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

కావలిరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ముందు వెళ్తున్న కారును వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. లేకుంటే పెను ప్రమాదం జరిగేది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన నల్లావుల అఖిల్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలసి కావలి వచ్చిన అఖిల్ తన కారులో భార్య, పిల్లలను నెల్లూరులోని అత్తగారిటి దగ్గర వదిలిపెట్టి స్నేహితుడితో కలసి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని ముసునూరు టోల్‌గేట్ దాటిన తరువాత కారును వెనుక వైపున వచ్చిన సిమెంట్ మిక్సర్ లారీ వేగంగా ఢీకొంది. దీంతో అదుపుతప్పిన కారు డివైడర్ పైకెక్కి మధ్యలో ఆగిపోయింది. దీంతో కారులో ఉన్న అఖిల్‌తో పాటు అతని స్నేహితుడు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. లారీ డ్రైవర్ ఫూటుగా మద్యం సేవించి లారీ నడపటమే ప్రమాదానికి కారణమని, కారు డివైడర్ దాటి ఉంటే పెను ప్రమాదం జరిగేదని బాధితులు వాపోయారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కపాళెంలో ఇనుప రాడ్‌తో దాడి

వెంకటాచలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో ఇద్దరిపై ఇనుపరాడ్‌తో దాడి చేసిన ఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇస్కపాళెనికి చెందిన కురుగొండ పద్మమ్మ, ఆమె కుమారుడు వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన తాటిపర్తి వెంకటేశ్వర్లు ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు వెంకటాచలంలోని సీహెచ్‌సీకి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పద్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 475

జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు

నెల్లూరు (లీగల్), ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో శనివారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకునేందుకు స్తోమత లేని వరంగల్‌కు చెందిన గండిబోయిన దివ్యకు దాతల సహకారంతో ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే. వాణి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, సైకాలజిస్ట్ డాక్టర్ కరిమద్దల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నేడు లలితా సహస్రనామ పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొగతోట ఆదిశంకరా ధ్యాన మందిరంలో ఆదివారం సాయంత్రం 4గంటలకు సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు మందిరం మేనేజింగ్ ట్రస్టీ ఆనందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కార్యక్రమంతోపాటు కుంకుమపూజ, సుహాసిని పూజలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉచిత విద్యుత్‌తో చేనేతలకు ప్రోత్సాహం

నెల్లూరురూరల్, ఆగస్టు 2,(ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు చేనేతలకు ఉచిత విద్యుత్ అందించడం నేత కార్మికుల వృత్తి ప్రోత్సహకానికి దోహదపడుతుందని నెల్లూరురూరల్ టీడీపీ అధ్యక్షుడు పముజుల ప్రదీప్ శనివారం ఓ ప్రకటన పేర్కొన్నారు. నేత కార్మికులకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం చేయడం, ఆ కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాన్ని కలిగిస్తుందన్నారు. వ్యవసాయం తరువాత అంతటి ఆదరణ కలిగిన చేనేత రంగాన్ని మొదట్నుంచి టీడీపీ ప్రభుత్వమే ఆదుకుంటూ వస్తున్నదని తెలిపారు.

గృహ వినియోగదారులకు సువర్ణావకాశం

● విద్యుత్ ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీతో అదనపు లోడ్ పెంచుకునేందుకు సువర్ణవకాశం ఇచ్చినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వీ. విజయన్ తెలిపారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గృహ విద్యుత్ వినియోగదారులు తాము వాడుకుంటున్న అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి అవకాశం ఇచ్చిందన్నారు. ఆగస్టు 1 నుంచి డిసెంబరు 31 వరకు ఈ రాయితీ ఉంటుందన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో కానీ, విద్యుత్ ఉపకేంద్రంలోని అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యుత్ రెవెన్యూ కేంద్రాల్లో కూడా చెల్లించుకోవచ్చన్నారు. కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2వేలు కట్టాలన్నారు. కానీ ఈ స్కీం కింద రూ.1000 రుపాయలు కడితే సరిపోతుందన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌లో మార్పు ఉండదన్నారు.

ఆధార్, పీఎఫ్ అకౌంట్లను పరిశీలించాలి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025లో అభ్యర్థుల సర్టిఫికెట్లుతోపాటు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పీఎఫ్ అకౌంట్‌ను పరిశీలించి ఎంపిక చేయాలని ఏపీ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి వీ.దేవేంద్ర గౌడ్ కోరారు. శనివారం నగరంలోని జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము వ్యాయామ విద్యా నిరుద్యోగుల కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. బీపీఈడీ కోర్సు రెండేళ్లు 75శాతం హాజరుతో శిక్షణ పొంది ఉండాలని, అయితే ఇలాంటి వారు చాలా ఎక్కువమంది నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మెగా డీఎస్సీలో ఈ పోస్టులకు పోటీ తక్కువగా ఉన్నందున ప్రభుత్వంలోని అన్నీ డిపార్టుమెంటులో పనిచేస్తున్న ఉద్యోగులు, మెడికల్ స్కూల్, ఎస్ఎస్ఏ, సచివాలయం, కేజీబీవీ, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, ఆర్‌వీఎం పీఈటీలో పనిచేస్తున్న వారు చాలామంది బీపీఈడీ కోర్సు చేయకుండానే సర్టిఫికెట్లు కొనుగోలు చేసి పరీక్షకు హాజరయ్యారని తెలిపారు.ఈ విషయం విద్యాశాఖా మంత్రి లోకేష్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రాలు ద్వారా విజ్ఞప్తి చేశామని తెలిపారు.

చెత్తంతా తరలుతోంది !

● అల్లీపురం వద్ద 50 వేల మెట్రిక్ టన్నులు

● ఇప్పటికే 20 వేల టన్నుల తరలింపు

● ఏళ్ల తరబడి సమస్యకు మోక్షం

నెల్లూరు(సిటీ), ఆగస్టు 2,(ఆంధ్రజ్యోతి): గతంలో అల్లీపురం వైపు ఎవరు వెళ్లాలన్న సోమిరెడ్డి ఇల్లు దాటాక, లేదా ముందు అని అడ్రసు చెప్పేవారు. కానీ ఇప్పుడు డంపింగ్ యార్డుకి ముందు తరువాత అంటూ అడ్రస్సు చెప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ మార్గంలోని పెట్రోల్ బంకు వద్ద మున్సిపల్ అధికారులు నగరంలోని చెత్తను ఇక్కడ డంప్‌చేశారు. అలా సుమారుగా 50 వేల మెట్రిక్ టన్నుల వరకు చేరుకుంది. దీన్ని అక్కడ్నుంచి తొలగించాలని ఈ ప్రాంతవాసులు కనిపించిన ప్రజాప్రతినిధులందరినీ, అధికారులను కోరుతూ వచ్చారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ చెత్త దిబ్బను తొలగించాలని నిర్ణయించింది. దీంతో జిగ్మా కంపెనీని రంగంలోకి దింపి మూడు పద్ధతుల్లో చెత్తను ఫిల్టర్ పట్టడం ప్రారంభించారు. అలా ఇప్పటి వరకు 20 వేల టన్నులను బయటకు తీశారు ఇందుకు పురపాలక శాఖ నిధులను ఖర్చు చేస్తుండగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా వాహనాలను సమీకరిస్తున్నారు.

● స్థలాల లెవలింగ్‌కు మట్టి, రాయి

అల్లీపురం డంపింగ్ యార్డులో ఫిల్టర్ చేసిన తరువాత బయటకు వచ్చే మట్టి, రాళ్లను కార్పొరేషన్ అధికారులు ఎన్ఎంసీకి చెందిన స్థలాల లెవలింగ్‌కు వినియోగిస్తున్నారు. ఎక్కడైతే లోతట్టుగా తమ స్థలాలుంటాయో అక్కడ ఈ మట్టి, రాయిని తీసుకెళ్లి ఎత్తు పెంచుతున్నారు. డంపింగ్ యార్డులో నుంచి బయటకు వచ్చిన మట్టి వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఎరువుగానూ వాడుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. ఇక మూడో పద్ధతిలో బయటకు వచ్చే ప్లాస్టిక్‌ను పునర్‌ఉత్పత్తి పరిశ్రమలకు తరలిస్తున్నట్లు కార్పొరేషన్ యంత్రాంగం పేర్కొంది.

తమ ప్రాంతంలో చెత్త దిబ్బను తీసేయాలన్న డిమాండ్‌కు చంద్రబాబు సర్కారులో మోక్షం కలిగింది. నగరంలోని నవాబుపేట, సౌత్‌రాజుపాళెం, అల్లీపురం, పెద్దచెరుకూరు, గుడిపల్లిపాడు ప్రాంతాల వాసులు ఎప్పట్నుంచో ఈ డంపింగ్ యార్డును తరలించాలని కోరుతున్నారు. అల్లీపురంలో నివాసముండే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కూడా అనేక దఫాలుగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం లభించింది.



చెత్తను ఫిల్టర్ చేస్తున్న యంత్రాలు

ఆర్టీసీలో తల్లులకు ప్రత్యేక గది

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం తల్లులు పిల్లలకి పాలు ఇచ్చుటకు ప్రత్యేకమైన గదిని ప్రారంభించారు. జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సీ. హేనాసుజన్ దీన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అరుణకుమారి, ఓఎస్‌బా సఖి వన్ స్టాఫ్ యస్‌కె షాజహాన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ ఎన్ ప్రశాంతి, ఎం. సునీత, నెల్లూరు-1వ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ చెంచులక్ష్మి పాల్గొన్నారు.

ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణం ప్రారంభం

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ ప్రాంతంలో ఎఫ్ఎఫ్‌సీ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) నిర్మాణం ప్రారంభమైంది. నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నెల్లూరునగర నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు తగినంత భూమి లేకపోవడంతో భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో రెండు ఎకరాల్లో ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించారు. ఇందుకుగాను రూ.12కోట్లు కేటాయించారు. ఏపీఐఐసీ పిలిచిన టెండర్ల ద్వారా జీ ప్లెస్ 2 భవన నిర్మాణ పనులను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. వీరు పనులను ప్రారంభించారు.



ఆలయాలకు మహర్దశ

● దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆలయాలకు మహర్దశ పట్టిందని జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా కొత్త ఆలయాల నిర్మాణం జరుగుతుందని వివరించారు.

? : జిల్లాలో ఆలయాల పరిస్థితి ఏంటి.

! : జిల్లాలో ఆలయాలకు మహర్దశ కలిగింది. పురాతన ఆలయాల పునఃనిర్మాణం, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నూతన ఆలయాల నిర్మాణం జరుగుతోంది.

? : ఎన్ని ఆలయాల పునర్‌నిర్మాణాలు జరుగుతున్నాయి.

! : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా వాసి కావడంతో జిల్లాలో 32 ఆలయాలు నిర్మాణానికి అనుమతులు లభించాయి.

? : ఇందుకు ఏమి చేయాలి.

! : ఎక్కడైనా పురాతన, శిధిల ఆలయాలు పునర్‌నిర్మించుకోవాలని స్థానికులు భావిస్తే, ఆ ఖర్చులో గ్రామస్థులు 1/3 వంతు సొమ్ము, దేవదాయ శాఖకు చెల్లిస్తే 2/3 వంతు నిధులను దేవదాయ శాఖ సర్వశ్రేయోనిధి (సీజీఎఫ్) ఇస్తుంది.

? : శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎన్ని ఆలయాలు నిర్మాణాలు జరుగుతున్నాయి.

! : శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10లక్షలు మంజూరు కాగా, 263 ఆలయాల పునర్‌నిర్మాణానికి ఆమోదం పొందాయి.

బీదకు అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బీసీ సంక్షేమ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు ఆయన నివాసంలో శనివారం దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.సలీం, ప్రధాన కార్యదర్శి మీరాసాహెబ్, యూత్ నాయకులు షేక్.షరీఫ్, తదితరులు బీదకు శాలువాతో సత్కరించారు. బీసీలకు అన్నీ రంగాలలో న్యాయం చేయాలని వారు కోరారు.



బీద రవిచంద్రను సత్కరిస్తున్న దూదేకుల సంక్షేమ సంఘం నాయకులు

మున్సిపల్ స్కూల్ సందర్శన

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ మునిసిపల్ స్కూల్‌ని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించే సిబ్బందితో మాట్లాడి ఆహార నాణ్యతా వివరాలను అడిగి తెలుసుకున్నారు.



వీఆర్ స్కూల్ సిబ్బందితో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

అక్రమ లేఅవుట్‌లో హద్దు రాళ్ల తొలగింపు

నెల్లూరు(వెంకటేశ్వరపురం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరం లోని వెంకటేశ్వరపురం పరిధి గాంధీ గిరిజనకాలనీ ప్రాంతంలో అక్రమంగా వేసిన లేఅవుట్‌పై ఇరిగేషన్,రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో జూలై 29న ప్రచురితమైన పూడ్చేసి....ప్లాట్లేసి కథనానికి వారు పరిశీలించి, ఈ వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేవని తేల్చారు. పొర్లుకట్టను తవ్వేయడంతోపాటు కాలువను పూడ్చేసి అక్రమ లేఅవుట్ వేయడంపై త్వరలో నిర్వాహకులపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. ప్లాట్‌లకు వేసిన హద్దు రాళ్లను తొలగించారు. మరికొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పాతిన కర్రలను సైతం తొలగించారు.



అనుమతి లేని లేఅవుట్‌లో హద్దురాళ్లు తొలగించిన అధికారులు

● ప్రభుత్వ స్థలాల పరిశీలన

నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ, జనార్దన్‌రెడ్డి ప్రాంతాల్లోని ప్రభుత్వ, ఇరిగేషన్ స్థలాలను రెవెన్యూ,ఇరిగేషన్,కార్పొరేషన్ శాఖల అధికారులు శనివారం పరిశీలించారు. ఆ స్థలాలను కొందరు నాయకులు ఆక్రమించి విక్రయాలు జరుపుతున్నట్లు అధికారులకు పలు ఫిర్యాదులు అందడంతో పరిశీలించారు. నివేదికను నెల్లూరు అర్బన్ తహసీల్దారుకు నివేదించనున్నట్లు తెలిసింది.

అనుమతుల్లేని భవన నిర్మాణాలు ఆపేయండి

నెల్లూరు(సిటీ), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ నుంచి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను ఆపేయాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. శనివారం హరనాథపురంలో పర్యటించిన ఆయన స్థానికంగా నిర్మాణంలో భవనాలను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న మూడు అపార్టుమెంట్లను ఆపాలని, అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్న మరో మూడు భవనాలను కూడా ఆపేయాలని ఆదేశించారు. ఈ మేరకు చార్జ్ షీట్లు దాఖలు చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. డివిజన్లలో ప్రతీ భవనాన్ని పరిశీలించి పిల్లర్ల దశలోనే ఆపేయాలని తెలిపారు.



అధికారులు, భవన యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

హైరిస్క్ బాధితులను గుర్తించాలి

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి హైరిస్క్ బాధితులను గుర్తించాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్తిభారత్ కార్యక్రమం జూన్ 2వ తేదీ నుంచి ప్రారంభమయిందన్నారు. ఇది 100 రోజులు జరుగుతుందని, హైరిస్క్ క్షయవ్యాధిని గుర్తించి తగిన పరీక్షలు చేపట్టాలని కోరారు. జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్‌లు అందరూ నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం రక్తనమూనాలు సేకరించి సరైన ఫలితాలు అందచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మలేరియా అధికారి నాగార్జునరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

ఆర్వోప్లాంట్ వితరణ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జీజీహెచ్ ప్రసూతి విభాగానికి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వేయి లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వోప్లాంట్‌ను వితరణగా అందచేసింది. శనివారం ఈ ప్లాంట్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా బ్యాంక్ రీజనల్ హెడ్ బండారు శ్యామ్ ప్రసాద్, డిప్యూటీ రీజనల్ హెడ్ శివశంకర్ పాల్గొన్నారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులు ప్రసూతి విభాగంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ కళారాణి, ఏడీ ఏడుకొండలు, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ గీతాలక్ష్మి, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు దారా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పెన్నాఘాట్ పరిశీలన

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలోని గణేష్ ఉత్సవ కమిటీ శనివారం పెన్నాఘాట్ వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల పనులను పరిశీలించింది. రంగనాయకులపేట గేట్ తిక్కన పార్కు, పెన్నాఘాట్ అభివృద్ధి పనులను పర్యవేక్షించి, జంగిల్ క్లియరెన్స్ నీటి నిల్వ సామర్థ్యం, పెంపు కోసం బండ్ నిర్మాణం పెద్ద క్రేన్లు ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లు త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని గౌరవ అధ్యక్షుడు పీ.సత్యనాగేశ్వరరావు, గౌరవ సలహాదారు సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు శ్రీకాంత్, వేలూరు మహేష్, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండ్ల ఈశ్వరయ్య తెలిపారు.



గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

గర్భిణులకు సీమంతం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం కొండాయపాళెం అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను అర్బన్ సీడీపీవో టీ. అరుణ మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే. విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, వెంకట్రావ్, ఏఎన్ఎం సుభాషిణి, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అద్దె చెల్లించని దుకాణాల మూత

నెల్లూరు(సిటీ), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లించకుండా ఉన్న మూడు దుకాణాలను ఎన్ఎంసీ అధికారులు శనివారం మూతేశారు. కార్పొరేషన్‌కు చెందిన మద్రాసు బస్టాండ్ వద్దనున్న ప్రకాశం పంతుల కాంప్లెక్స్‌లో 8,9,13 నెంబర్లు దుకాణాలకు అద్దె రూ. లక్షల్లో పేరుకుపోయిందని ఆర్ఐ కిరణ్ తెలిపారు. పలు దఫాలుగా నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో దుకాణాలను మూతేసినట్లు ఆయన తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో దుకాణాలను అద్దెకు తీసుకున్నవారు సకాలంలో అద్దె చెల్లించాలని, లేకపోతే ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం చర్యలు తీసుకుంటామన్నారు.



తాళం వేసిన దుకాణాల వద్ద రెవెన్యూ అధికారులు

జర్నలిస్టులు క్రీడల్లో పాల్గొనాలి



విలేకరులతో మాట్లాడుతున్న ద్వారకానాథ్

నెల్లూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో బిజీగా ఉండే జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడల్లో పాల్గొనాలని ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించి, జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ జిల్లాశాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం జేశాప్ రాష్ట్ర కార్యదర్శి నరేష్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జేశాప్ గౌరవ సలహాదారులు జీటీ.మౌంట్ బాటన్ తదితరులు పాల్గొన్నారు.

● కమిటీ ఎన్నిక

జేశాప్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ముక్కాల ద్వారకనాథ్ , గౌరవ సలహాదారుడిగా జీటీ.మౌంట్‌బాటన్, అధ్యక్షుడిగా ఎస్.నంద కిషోర్, ప్రధాన కార్యదర్శిగా జే.సునీల్‌కుమార్, కోశాధికారిగా జనార్దన్, ఉపాధ్యక్షుడిగా వెంకట్రావు, నిర్వాహక కార్యదర్శిగా పరమేశ్వర్, కార్యదర్శిగా ముజ్జు, సంయుక్త కార్యదర్శులుగా మాల్యాద్రి, అభి, సభ్యులుగా ఆరిఫ్, కరిముల్లా, భరత్, హుస్సేన్, మధు, కమల్‌లు ఎంపికయ్యారు.

డ్రగ్స్ అంతం.. డీవైఎఫ్ఐ పంతం

● జాతీయ అధ్యక్షుడు రహీం

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ అంతమే డీవైఎఫ్ఐ పంతమని డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యులు ఏఏ రహీం తెలిపారు. శనివారం నగరంలో డ్రగ్స్ వద్దు - ఆరోగ్యం ముద్దు అన్న నినాదంతో ప్రదర్శన జరిగింది. అయ్యప్పగుడి నుంచి వేదాయపాళెం వరకు ఈ పదర్శన సాగింది. ఈ ప్రదర్శనను వేదాయపాళెం సీఐ శ్రీనివాసులు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పాటు పడాలని పిలుపునిచ్చారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, కొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ కార్యకర్తలు

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానము

బుచ్చిరెడ్డిపాళెం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. సెల్: 9441183561, 9490289380

మెట్ట భూములు వేలం పాట ప్రకటన

శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం మండలం, బుచ్చిరెడ్డిపాళెం టౌన్‌లో వేంచేసియున్న శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానమునకు హక్కు భుక్తమైన ఈ క్రింది తెలియపరచిన షెడ్యూలు దాఖలా పొదలకూరు మండలం, భోగసముద్రం గ్రామములోని సర్వే నెం.6-6, 8-1 మరియు 8-7 నుండి 8-14లలో గల య.09.49 సెం. మెట్ట భూములను 2025-2026 సం..ల నుండి 2030-2031 సం.ల వరకు అనగా ఆరు (6)సం.ల వరకు కౌలు సాగుబడికి గాను తే.18-08-2025ది సోమవారం మ.గం.12-00 ని.లకు బుచ్చిరెడ్డిపాళెం టౌన్‌లోని శ్రీస్వామి వారి దేవస్థానము వద్ద బహిరంగ కౌలు వేలం పాట షరతులకు లోబడి జరుపబడును. కావున ఆసక్తి గల వారందరూ వేలము నందు పాల్గొనవచ్చును.

ఇతర వివరములకు, షరతులకు పై కార్యాలయములో తెలుసుకొనవచ్చును.

బుచ్చిరెడ్డిపాళెం
తేది.02-08-2025

ఇట్లు: దొడ్ల మురళీకృష్ణారెడ్డి
వ్యవస్థాపక ధర్మకర్త మరియు ఎగ్జిక్యూటివ్ ఆధారిటీ

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానము

బుచ్చిరెడ్డిపాళెం టౌన్ & మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. ఫోన్: 9441183561, 9490289380

సీల్డ్ టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాళెం టౌన్ మరియు మండలంలో వేంచేసియున్న శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానమునకు ఈ క్రింది జతపరచిన ఐటమ్‌లకు తేది:18.08.2025న సోమవారము ఉ.11.00లకు వ్యవస్థాపక ధర్మకర్త & ఎగ్జిక్యూటివ్ ఆధారిటీ వారు మరియు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో శ్రీవారి దేవస్థానం వద్ద సీల్డ్ టెండరు నిర్వహించబడుచున్నవి.

వ.నెం.	టెండరు వివరములు	ప్రథమ ధరావత్తు	కాలపరిమితి	సీల్డ్ టెండరు తేది మరియు సమయం
1	ఫల సరుకులు సరఫరా చేయుట	రూ.10,000/-	తేది.01.10.2025 నుండి తేది.30.09.2026 వరకు	శ్రీ వారి దేవస్థానములో, తేది.18.08.2025 ఉ.గం.11.00 లకు
2	పుష్పములు సరఫరా చేయుట	రూ.5,000/-		

షరతులు: 1. టెండర్లు లో పాల్గొనువారు పై తెలిపిన ఐటమ్‌లకు ఎదురుగా జతపరచిన ప్రథమ ధరావత్తును శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానము, పేరిట తీయబడిన డి.డి. లేదా నగదు రూపములో మాత్రమే చెల్లించవలెను. (చెక్కులు స్వీకరించబడవు) 2. నెం.1,2నకు సీల్డ్ టెండరులలో తక్కువ మొత్తములను కోట్ చేసిన వారికి సదరు హక్కు ఖరారు చేయబడును. 3. వ.నెం.1 నుండి 2 వరకు గల ఐటమ్‌లకు గాను కాలపరిమితి తేది.01.10.2025 నుండి తేది.30.09.2026 వరకు మాత్రమే ఆయా సరుకులను తమ సొంత ఖర్చులతో రవాణా చేసుకొనవలెను. 4. మిగిలిన వివరములు దేవస్థాన కార్యాలయము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

బుచ్చిరెడ్డిపాళెం
తేది.02-08-2025

ఇట్లు: దొడ్ల మురళీకృష్ణారెడ్డి
వ్యవస్థాపక ధర్మకర్త & ఎగ్జిక్యూటివ్ ఆధారిటీ

అవయవదానం ప్రాణదానం!

- మనిషి రెండుసార్లు జీవించే అవకాశం
- జిల్లాలో కిడ్నీ, నేత్రదాతలే ఎక్కువ
- ఇతర అవయవాలదానానికి ప్రోత్సాహం
- నేడు జాతీయ అవయవదాన దినోత్సవం



నెల్లూరు (వైద్యం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మరణానంతరం అవయవదానం చేయటం వల్ల మరో కొందరికి ఆ అవయవాలు ఎంతో ఉపయోగ పడతాయి. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి ఇచ్చే అవయవాల వల్ల మరో వ్యక్తి ప్రాణాలు నిలుపవచ్చు. సామాజిక కట్టుబాట్లు, మూఢనమ్మకాల కారణంగా ఎంతో మంది సేవాదృక్పథం ఉన్న వారు సైతం, తమ మరణానంతరం కుటుంబసభ్యుల ద్వారా అవయవదానం చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. జిల్లాలో సకాలంలో అవయవాలు అందక ఏటా 2వేల మందికిపైగా రోగులు మరణిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బ్రెయిన్‌డెత్‌కు గురయిన వారిలో గత పదేళ్లలో 60 మంది మాత్రమే ముందుకు వచ్చి అవయవదానం చేశారు. ఈ నేపథ్యంలో అవయవదానంపై చైతన్యం తీసుకువచ్చేలా ఆగస్టు 3న (నేడు) జాతీయ అవయవదాన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

● జిల్లాలో వ్యాధిగ్రస్థులెందరో...

జిల్లావ్యాప్తంగా ఎంతోమంది వ్యాధిగ్రస్థులు అవయవ దాతల కోసం ఎదురు చూస్తున్నారు. కిడ్నీ, గుండె, లివర్, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్థులు వేలసంఖ్యలో ఉన్నారు. వీరిలో 4 వేల మందికి ఆయా అవయవాలు అవసరం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆయా అవయవాలను సకాలంలో అమరిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు. కిడ్నీ వ్యాధిగ్రస్థులు జిల్లాలో 30 వేల మంది ఉండగా, వీరిలో రెండు కిడ్నీలు చెడిపోయి ఏటా 2500 మంది రోగులు మృత్యువాత పడుతున్నారు. వీరికి కుటుంబ సభ్యులు ఓ కిడ్నీ దానం చేసినా బతికే అవకాశం ఉంది. అయితే ఇందులో కేవలం 20 నుంచి 30శాతం మంది మాత్రమే ఇందుకు ముందుకు వస్తున్నారు. గుండె వ్యాధులకు సంబంధించి గుండె మార్పిడికి ఏటా వేయి మందికిపైగా అవసర మవుతుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది కావటంతో ఎందరో పేదలు మృత్యు వాత పడుతున్నారు. కొందరు ఉన్నత వర్గాలు మాత్రమే దాతల సహకారంతో గుండె మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకుంటున్నారు. లివర్ పూర్తిగా దెబ్బతిని లివర్ మార్పిడి అవసరమైన ఏటా 1500 మంది రోగులు మార్పిడి చేయించుకోలేక మరణిస్తున్నారు.

● ప్రచారమేదీ ?

విజయవాడ కేంద్రంగా జీవన్‌దాన్ సంస్థ అవయవ దానం మార్పిడికి అనుమతులు ఇవ్వాలి. ప్రభుత్వం గుర్తించిన ఈ సంస్థలో ఇప్పటికే జిల్లాకు చెందిన వందల మంది రోగులు అవయవాల కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో కిడ్నీ వ్యాధుల బాధితులే ఎక్కువ. నేత్ర బాధితులు కూడా ఉన్నారు. ఇదిలా ఉంటే అవయవ దానంపై ఈ సంస్థ పెద్దఎత్తున చైతన్యం తీసుకురావాల్సి ఉన్నా ఆదిశగా కృషి చేయటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అసలు ఈ జీవన్‌దాన్ సంస్థ ఉండి ఏమి ప్రయోజనం అన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం సానుకూల స్పందన



అవయవదానం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడ వచ్చు. అయితే అపోహల కారణంగా చాలా మంది ముందుకు రావటం లేదు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అవయవదానాన్ని ప్రోత్సహించటం అభినందనీయం. అలాంటి దాతల అంత్యక్రియల్లో తప్పని సరిగా ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చింది. అవయవ దానంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సి ఉంది.

- గిరినాయుడు, కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, ఈడీ

ఇప్పటి వరకు 125 కిడ్నీల మార్పిడి



గత 8 ఏళ్లలో 125 వరకు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించాం. అలాగే 25 మంది అవయవ దానం చేసిన వారు ఉన్నారు. అయితే దాతలు తక్కువగా ఉండటంతో అనేక మంది రోగులకు సకాలంలో అవయవాలు అందక మరణిస్తున్నారు. ప్రభుత్వం కూడా అవయవ దానం చేసే వారిపట్ల ఎంతో ఆదరణ చూపాలని పిలుపు నివ్వటం శుభసూచకం.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నెఫ్రాలజిస్ట్

ఫీజుల దోపిడీ అరికట్టాలని ఆందోళన

నెల్లూరు (విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి మాట్లాడారు. పాఠశాలల్లో అధిక ఫీజుల కారణంగా తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే అనేక పాఠశాలలు అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపట్టి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. దీనిపై విద్యాశాఖాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నేతలు హేమంత్‌రెడ్డి, మౌనిష్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూముల ఆక్రమణపై విచారణ



మేత పోరంబోకు భూముల ఆక్రమణలపై విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

కలువాయి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశమనేనిపల్లి రెవెన్యూ పరిధిలోని వందల ఎకరాల మేత పోరంబోకు భూములను తిరుమలపాడు గ్రామస్థులు కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని కేశమనేనిపల్లి గ్రామస్థులు పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం స్థానిక రెవెన్యూ అధికారులు గ్రామానికి వెళ్లి ఆక్రమణలపై ప్రాథమిక విచారణ జరిపారు. కేశమనేనిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 438లో 673 ఎకరాల మేత పోరంబోకు భూములు ఉన్నాయి. అయితే ఈ భూములను గత కొన్నేళ్లుగా ఇదే రెవెన్యూ పరిధిలోని తిరుమలపాడు గ్రామస్థులు ఆక్రమించుకుని నిమ్మతోటలు సాగు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకొక్కరు 10ఎకరాల వరకు ఆక్రమించుకుని బోరు వేసుకుని విద్యుత్ సర్వీసులు కూడా తీసుకున్నారని, నిమ్మతోటలు సాగు చేసిన భూములే కాకుండా మిగిలిన వందల ఎకరాల భూములకు బౌండరీలు వేసుకుని వారి ఆక్రమణలో ఉంచుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈవిషయమై స్థానిక తహసీల్దారుకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్య తీసుకోలేదని గ్రామస్థులు తెలిపారు. ఆక్రమణలు తొలగించి మేత పోరంబోకు భూములను కాపాడాలని వారు కలెక్టరును కోరారు.

రూపాయితో నెలంతా కాల్స్ చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రూ.1తో రీచార్జ్‌తో 30రోజులు ఉచిత డేటా కాల్స్ చేసుకునే అవకాశం కల్పించిందని టెలికామ్ జిల్లా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ సీఏ.రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆఫర్ ఆగస్టులో బీఎస్ఎన్ఎల్ కొత్త సిమ్ ఉచితంగా పొందిన వారికి మాత్రమేనని తెలిపారు. ఇతర ఆపరేటర్ల నుంచి బీఎస్ఎన్ఎల్ పోర్టబులిటీ సౌకర్యం పొందిన వినియోగదారులకూ వర్తిస్తుం దని తెలిపారు. వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని కానీ రిటైల్ కేంద్రాలను కానీ సందర్శించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మైనింగ్ అనుమతులు రద్దు చేసే వరకు పోరాటం

● వరికుంటపాడులో స్పష్టం చేసిన జేఏసీ నాయకులు ● ర్యాలీని అడ్డుకున్న పోలీసులు.. 144 సెక్షన్ అమలు



పోలీసులు అడ్డుకోవడంతో నేలపై బైఠాయించిన ఆందోళనకారులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో మైనింగ్ (తెల్లరాయి తవ్వకాలు) అనుమతులను ప్రభుత్వం రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. 2వ రోజు శనివారం కూడా తమ ఆందోళనలో భాగంగా వరికుంటపాడులోని రామాలయం నుంచి శాంతి ర్యాలీ నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు. నినాదాలు చేస్తూ గ్రామస్థులు ఎస్సీ కాలనీ వరకు చేరుకోగా పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. సుమారు 2 గంటలపాటు అలాంటి తంతే కొనసాగడంతో ఓపిక నశించిన ఆందోళనకారులు పోలీసులను నెట్టుకొని గ్రామ ముఖద్వారం వరకు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో తోపులాట చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం ఉదయగిరి సీఐ వెంకట్రావు అక్కడకు చేరుకుని 144 సెక్షన్ అమలు చేసినట్లు హెచ్చరించి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్, సర్పంచు దిలీప్‌కుమార్ మాట్లడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకే తాము పోరాడుతున్నామే తప్ప ఇంతమంది పోలీసులు వచ్చేలా ఎలాంటి హింసాత్మక సంఘటనలు, మనోభావాలు దెబ్బతినే కార్యక్రమాలకు పాల్పడటం లేదన్నారు. ప్రశాంతంగా సాగుతున్న ర్యాలీని గంటల తరబడి అడ్డుకుంటున్నారంటే మేం చేసిన తప్పు ఏమిటని నిలదీశారు. కలెక్టర్ సహా మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోలేదన్నారు. తమ ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తే మరింత ఉధృతం చేసి ప్రాణత్యాగానికైనా సిద్ధపడతామని హెచ్చరించారు.



పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట

● పోలీసుల పహారా

జాతీయ రహదారిపై ర్యాలీ చేపడతారని తెలుసుకున్న పోలీసులు ఉదయం నుంచే పహారా కాశారు. వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి ఎస్ఐలు రఘునాథ్, ఆదిలక్ష్మి, శ్రీను తమ సిబ్బందితో హైవేతోపాటు ప్రధానవీధిలో ఎలాంటి ఆందోళనలు చేపట్టకుండా కట్టడి చేశారు. కాగా, సర్పంచు సహా జేఏసీ నాయకులు ఆంద్రా పరంధామిరెడ్డి, షేక్ పీరయ్య, సారాబు లక్ష్మీనారాయణ, సుంకర రాధాకృష్ణ తదితరులను సీఐ పోలీసు స్టేషన్ పిలిపించి ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఆందోళన చేస్తే కేసుల పెడతామనిని హెచ్చరించారు.

జలజీవన్ పనులు ఎందుకు ఆగాయి!?

● మురుగు కాలువల పరిస్థితీ అంతే! ● జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యుల ఏకరువు

నెల్లూరు (జడ్పీ) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : 'తాగునీటి పథకానికి సంబంధించిన జలజీవన్ మిషన్ పనులు గ్రామాల్లో జరగడం లేదు. ఆ పనులు ఎందుకు ఆపారో తెలపండి.' అంటూ జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు నిలదీశారు. శనివారం నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలువాయి, మర్రిపాడు, కనిగిరి, కొండాపురం జడ్పీటీసీ సభ్యులు అనిల్, సుధాకర్‌రెడ్డి, మాల్యాద్రి, వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ తమ మండలాల్లో జలజీవన్ పనులు ఆపేశారంటూ ఏకరువు పెట్టారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో జడ్పీ నిధులతో చేపట్టిన మురుగు కాలువల నిర్మాణాలు ఏడాది అయినా ఇంతవరకు పూర్తికాలేదని అధికారులను ప్రశ్నించారు. విడవలూరు మండలంలో కాలువ పనులు జరగకుండా సర్పంచులు అడ్డుకుంటున్నారని, దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అలాగే కలువాయి, మర్రిపాడు మండలాల్లో కాలువల నిర్మాణాలు పూర్తయి 8 నెలలు గడిచినా ఎంబుక్‌లు సిద్ధం చేయలేదని, బిల్లులు ఇవ్వడం లేదని అన్నారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ రెడ్డప్ప మాట్లాడుతూ తాను కొత్తగా వచ్చానని, పనులపై సమీక్షించి పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం డీపీవో శ్రీధర్‌రెడ్డి జిల్లాలో చేపడుతున్న పారిశుధ్య పనులను వివరించారు.

● పీ4పై బలవంతం ఏల!?

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ4 పథకాన్ని తీసుకోవాలని అధికారులు తమపై బలవంతం చేస్తున్నారని జడ్పీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పేదలను దత్తత తీసుకోవాలేతప్ప జడ్పీటీసీలకు ఆ స్తోమత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దీంతో జడ్పీ సీఈవో మోహన్‌రావు వివరణ ఇస్తూ పీ4 పథకంపై ఎవరిపైనా ఒత్తిడి తెచ్చేది ఉండదన్నారు. ఎన్ఆర్ఐలు, ప్రజాప్రతినిధులు ఇందులో భాగస్వామ్యులు కావాలని ప్రభుత్వం కోరిందన్నారు. అంతే తప్పా జడ్పీటీసీలపై ఎలాంటి ఒత్తిడి తేవడం లేదని తెలిపారు. అనంతరం విద్య, స్త్రీ శిశు సంక్షేమం తదితర శాఖలపై సమీక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ

యాక్సిస్ బ్యాంకు కుంభకోణంపై దశలవారీ పోరాటం

● రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల నిర్ణయం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 2(ఆంధ్ర జ్యోతి): యాక్సిస్ బ్యాంకులో జరిగిన భారీ కుంభకోణంపై దశలవారీగా పోరాటం చేస్తామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి ఆడిటోరియంలో ఆయన అధ్యక్షతన శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలో నిరక్షరాస్యులైన గిరిజనులను, దళితులను, బీసీలను లక్ష్యంగా చేసుకుని, ముత్తుకూరు యాక్సిస్ బ్యాంకులో రూ. కోట్ల రుణాలను వారిపేరుతో తీసుకుని మోసం చేయడం దారుణమన్నారు. ఈ కుంభకోణంపై నేటికీ పోలీసులు విచారణ చేయలేదని ఆరోపించారు.ఈ కుంభకోణంపై దశలవారీగా పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామరాజు, ఏఆర్‌డీ చైర్మన్ బషీర్, రజక సంఘం నాయకులు పద్మజ, డీవీఎంసీ సభ్యులు మురళి, దసరి పోలయ్య, మాజీ డీవీఎంసీ సభ్యులు కొప్పాల రఘు, యానాదుల సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

17,18 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17, 18తేదీల్లో నెల్లూరులో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. శనివారం నగరంలోని పురమందిరం రీడింగ్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25 వరకు రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఈ నెల 12న కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు- ఇళ్ల స్థలాలు- భూసమస్యలు అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో రూ. లక్షల అవినీతి జరిగిందని, అధికారులతో పాటు దళారుల చేతుల్లోకి ఈ నిధులు వెళ్లాయని విమర్శించారు. ఈ విషయమై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లీలామోహన్, నందిపోగు రమణయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు షాన్‌వాజ్ పాల్గొన్నారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్ హర్షనీయం

● చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బాలాజీ



ఉచిత విద్యుత్‌పై హర్షం వ్యక్తం చేస్తున్న చేనేత సంఘాల నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయడం హర్షనీయమని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీని కూడా పూర్తిగా తొలగించాలన్నారు. జిల్లాలో సుమారుగా 3600 చేనేత మగ్గాలున్న చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం కొంతమేర ఊరట నిస్తుందన్నారు. చేనేత కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రభుత్వ, ప్రైవేటురంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, పద్మశాలి సంఘం నాయకులు సోమగోపాల్, చింతలపూడి పెంచలయ్య, డాక్టర్ మారం సుధాకర్, రామనాథం రాజశేఖర్, కాసా శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మురళి తదితరులు పాల్గొన్నారు.

4 బంగారు కుటుంబాల దత్తత

● ఎంపీపీ దర్శిగుంట దాతృత్వం



ఎంపీపీ శశిరేఖను సన్మానిస్తున్న ప్రత్యేకాధికారి, కార్యాలయ సిబ్బంది

అల్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన పీ-4 కార్యక్రమంలో భాగంగా పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి దోహదపడే కార్యక్రమానికి అల్లూరు ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ముందడుగు వేశారు. శనివారం ఆమె ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని 4 పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఒక యువతి సేవా దృక్పథం కలిగి ఉండడాన్ని గుర్తించిన ప్రజలు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మృదుల, ఇన్‌చార్జి ఎంపీడీవో పెంచల వీరేంద్ర, కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు.

అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకోండి

● జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ కార్తీక్, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లు, ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుని క్రమబద్ధీకరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శనివారం వింజమూరు ఎస్వీఎస్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా అధికారులు, యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బృహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. ఎల్ఆర్ఎస్‌లో లేఅవుట్ల యజమానులు చేరాలన్నారు. జూన్ 30వ తేదీకి ముందు వేసిన అనధికార లేఅవుట్లకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. అక్టోబరు 24వ తేదీలోపు సంబంధిత యజమానులు హక్కు, ప్లాన్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణకు గతంలో 14 శాతం నగదును యజమానులు చెల్లించాల్సి ఉండేదని, దానిని రాష్ట్ర ప్రభుత్వం 7 శాతానికి కుదించినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకోని వారి లేఅవుట్లను నిషేధిత భూముల జాబితాలో చేర్చడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం వింజమూరు పట్టణంలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ లైటింగ్ పనులను నుడా నిధులతో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ, పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, లేఅవుట్ల యజమానులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఫాప్టో నేతలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఫాప్టో నేతలు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం శనివారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఫాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోచైర్మన్ మాసప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకో కపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. విద్యారంగ సమస్యలపై కాలయాపన చేస్తూ ఉపాధ్యాయులకు బోధనేతర భారాన్ని పెంచడం సరికాదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు కూడా ఇవ్వకపోవడంతో ఆర్థిక పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. రాష్ట్ర కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు రావాల్సిన గ్రాడ్యుటీ, పెన్షన్, సరెండర్ లీవ్, డీఏ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసమస్యలను పరిష్కరించుకుంటే మరిన్ని ఉద్యమాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్‌లను తెలియచేస్తూ జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీ శేషులు, హజరత్, రాష్ట్ర పరిశీలకులు పివి.రమణ, రమణయ్య, నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు

ఆత్మకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నుంచి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌లో తప్పుల సవరణలు, నమోదు, మొబైల్ లింక్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కావున మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9569
వెండి కిలో ధర	రూ. 114200
వెండి ఒక గ్రాము	రూ. 117.20

బళ్లారి రాఘవకు నివాళి



రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

ఉదయగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో శనివారం ప్రముఖ రంగస్థల, సినీనటుడు బళ్లారి రాఘవ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జీ రమేష్, సీనియర్ ప్రొఫెసర్లు గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, సునీత, కిషన్ తేజ, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ పనులు జరుగుతున్న దృష్ట్యా అన్ని 11కేవీ ఫీడర్లకు సంబంధించి ఆదివారం ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట సుబ్బయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అందమైన చేతి రాతతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చునని నెల్లూరుకు చెందిన అచరిత్ర ఫౌండేషన్ ఛైర్మన్ కృపాల్, వైస్ ఛైర్మన్ సురేష్ అన్నారు. శనివారం పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు.

మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అనంతసాగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత మాతమ్మ, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో యువత ముందుకు సాగాలి : మంత్రి ఆనం

ఆత్మకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనతో యువత ముందుకు సాగాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఆత్మకూరు ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా జాబ్‌మేళా శనివారం ముగిసింది. ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయికి చెందిన సుమారు 100 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొని 1200 మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నియామక పత్రాలను అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి సహాయ సహకారాలతో జాబ్‌మేళా విజయవంతమైందన్నారు.



ఉద్యోగ నియామకపత్రాలను అందజేస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా

ఉద్యోగాల్లో చేరితేనే జాబ్‌మేళాకు సార్థకత : గుండ్రా

ఆత్మకూరు పట్టణంలో ఇంత పెద్దఎత్తున జాబ్‌మేళా నిర్వహించడం చారిత్రాత్మక కార్యక్రమమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి తెలిపారు. నియామక పత్రాలు పొందిన ప్రతిఒక్కరూ ఉద్యోగాల్లో చేరితేనే ఈ జాబ్‌మేళాకు సార్థకత చేకూరుతుందన్నారు. ఉద్యోగాల్లో చేరిన తరువాత ఏమైనా సమస్యలు ఉంటే మంత్రి ఆనం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం ఉద్యోగాలు పొందినవారికి నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి పావని, మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, కంపెనీల కోఆర్డినేటర్ కన్నన్, హెచ్‌ఆర్‌లు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. స్థానిక సచివాలయం-3 ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హత కలిగిన రైతులు ఆర్థిక సహాయం పొందనట్లయితే సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే మలివిడతలో మొత్తం పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ కె కార్తీక్, ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు హమీద్, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, ఎంపీపీ ఇనగనూరి మోహన్ రెడ్డి, సర్పంచ్ సృజన, ఎంపీటీసీ సభ్యులు యాకసిరి భవానీ, రైతు అధ్యక్షులు బొల్లినేని వెంకటరామారావు, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు ఆవుల అరుణమ్మ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, ఏడీఏ ఎం.శేషగిరి రావు, ఏవో ఏ.వాసు, ఉదయగిరి ఏడీ జి.లక్ష్మీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, టీడీపీ మండల నాయకులు, అధికారులు ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో భాగంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకానికి శనివారం శ్రీకారం చుట్టిందని ఏఎంసీ ఛైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, ఆత్మకూరు ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో 34,223 రైతు కుటుంబాలకు రూ.23.20 కోట్ల మేర వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ఆత్మకూరు ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజాకుమారి మాట్లాడుతూ ఎవరైనా అర్హులైన రైతులకు జమ కానట్లయితే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, పులిమి శైలజారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నూరా భాస్కర్‌రెడ్డి, కొప్పోలు రమాదేవి తదితరులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేస్తోందని తెలి పారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు అబ్బూరి రమేష్‌నాయుడు, శాఖమూరి నారాయణ, మెట్టుకూరు కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ మహబూబ్‌బాషా, శివకోటారెడ్డి, ఐఎఎల్ ఏవో పి చంద్రభాను, ఏఎంసీ కార్యదర్శి కృష్ణప్రసాద్, ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రి పాడు, సంగం మండలాల వ్యవసాయ శాఖాధికారులు కె కిషోర్‌బాబు, ఎస్ సురేషబాబు, కవిత, శశిధర్, ఏఈవోలు, వీఏఏలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



ఆత్మకూరు: అన్నదాత సుఖీభవ పథకం నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు

● **మర్రిపాడు:** నగదు జమకాని అర్హులు ఎవరైనా ఉంటే సచివాలయాలలో సిబ్బందిని సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి ఎన్ కవిత శనివారం తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులు వీక్షించేలా అన్ని రైతుసేవా కేంద్రాలల్లో టీవీలు ఏర్పాటుచేశారు. మండల కేంద్రంలోని సచివాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సర్పంచ్ టీబీజాన్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, నరేష్, చెన్నకృష్ణారెడ్డి, వెంకట్‌చౌదరి, విజయ్‌భాస్కర్, పుల్లయ్య నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని పేరారెడ్డిపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో పి సునీలత మాట్లాడుతూ తల్లిపాలలో అనేక పోషకాలు ఉన్నాయని, ఆరునెలల వరకు తల్లిపాలు బిడ్డకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులునాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు వేణుకుమారి, మస్తానమ్మ, లక్ష్మీనారాయణమ్మ,వాణీ గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

● **ఉదయగిరి :** తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం అని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి వినీత అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని కృష్ణంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **దుత్తలూరు:** మండలంలోని రాచవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్ తల్లిపాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బిడ్డకు ఆరునెలలపాటు తల్లి పాలు తాగించాలని సూచించారు. అనంతరం వ్యాధినిరోధక టీకాల కార్య క్రమాన్ని పరిశీలించి క్రమం తప్ప కుండా టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకారయ్య, సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్, అంగన్‌వాడీ, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం:** మండలంలోని అయ్యవారిపల్లి ఎస్సీకాలనీ అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్‌షాను మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను పట్టించి ఆరు నెలల వరకు తల్లిపాలను క్రమం తప్పకుండా తాగించాలన్నారు. అనంతరం పోస్టర్లను ప్రదర్శించి తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మీదేవి, రత్నమ్మ, మస్తాన్బీ, రాధ, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.



ఉదయగిరి: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి వినీత

● **ఏఎస్ పేట:** పిల్లలకు తల్లిపాలు ఇస్తే ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె గుంపర్లపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలవారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముర్రుపాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌పిహెచ్ మంజుల, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం షేక్ అహ్మద్‌షరీఫ్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి



పింగళి వెంకయ్యకు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీ కంటే మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఉదయగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ దీక్షితరంత్ పేర్కొన్నారు. శనివారం దుత్తలూరు, నందిపాడు గ్రామాల్లో ఉన్న మద్యం దుకాణాలను తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

6న ఉదయగిరిలో ప్రత్యేక గ్రీవెన్స్

ఉదయగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఈనెల 6వ తేదీన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎల్ రామ్మోహన్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆత్మకూరు ఆర్డీవో పావని పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని మండలంలోని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు షాజియా, వీఆర్వోలు షేక్ మాలకొండయ్య, బిల్లుపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లపై పనిభారం తగ్గించాలి

అనంతసాగరం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లపై పనిభారం తగ్గించాలని మండల సీఐటీయూ అధ్యక్షుడు అన్వర్‌బాష డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిబ్బందికి ప్రత్యేక యాపులు ఇవ్వడం ద్వారా సర్వర్లు పనిచేయక ఇబ్బంది పడుతుంటే మెమోలు ఇస్తామని అధికారులు హెచ్చరిస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు సమస్యను గుర్తించి వారిపై పనిభారం తగ్గించాలని కోరారు..

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సీతారామపురం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డుప్రమాదంలో మరణించిన గొల్లపల్లి సురేష్ కుటుంబానికి శనివారం మండల వైసీపీ అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, పొట్టి రామచంద్రయ్య, బాలినేని మాబయ్య, పాలకొలను వెంకటరెడ్డి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలి

ఉదయగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవోలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు సూచించారు. శనివారం వారు పట్టణంలోని దళితవాడ ఆదర్శ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి రుచి చూశారు. అలాగే ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు మండలంలోని దాసరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థి మిత్ర కిట్లకు సంబంధించి వేలి ముద్రల సేకరణ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షబ్బీర్, ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈవోలు

నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై కేసులు

సంగం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగం - నెల్లూరు రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను శనివారం రాత్రి విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. పరిమితికి మించి అధిక లోడుతో, లైసెన్సులు లేకుండా తిరుగున్న వాహనాలను విజిలెన్స్ సీఐ సుభాన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిబంధనలను అతిక్రమించిన పలువురు వాహనాదారులకు కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్, పోలీసులు పాల్గొన్నారు.



సంగం - నెల్లూరు రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ సుభాన్, పోలీసులు

కృష్ణాష్టమి వేడుకలకు పోలీసుల అనుమతి

వింజమూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు శంఖవరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని శంకవరం గ్రామంలో ఆగస్టు 16వ తేదీ నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు, 23వ తేదీన ఊరేగింపు జరుపుకొనుటకు అనుమతి ఇవ్వాలని కలిగిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ నరసింహారావుకు వినతి పత్రం అందచేశారు. దీంతో సీఐ గత సంవత్సరంలాగానే వేడుకలు చేసుకోవాలని అనుమతినిచ్చారు. ఊరేగింపునకు బందోబస్తు కోసం చలానా కట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ నిర్వాహకులు జి.ప్రసాద్, బి.మాలకొండారెడ్డి, సీహెచ్. మహేంద్ర, డి.మధు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: పొన్నెబోయిన

ఉదయగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ లోటులో ఉన్నా సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేస్తున్న ఘన త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే నన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500 మాత్రమే ఇచ్చిందని, చంద్రబాబు రూ.20 వేలు ఇస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పండించిన పంటలకు సైతం గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

నిద్రిస్తున్న యాచకురాలిపై దూసుకెళ్లిన కారు

● అక్కడికక్కడే దుర్మరణం



గురవమ్మ మృతదేహం

కావలిరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కావలి రైల్వేస్టేషన్ ఆవరణలో నిద్రిస్తున్న ఓ యాచకురాలిపై గుర్తు తెలియని ఓ కారు దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. 1వ పట్టణ పోలీసుల కథనం మేరకు.. వ్యసనాలకు బానిసైన పర్షాపు గురవమ్మ(21) భిక్షాటన చేస్తూ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిద్రిస్తుండేది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి స్టేషన్‌లోని ఆటోస్టాండ్ సమీపంలో ఆరుబయట నిద్రిస్తుండగా స్టేషన్ నుంచి బయటకు వెళ్తున్న ఎరుపు రంగు కారు ఆమెను తొక్కుకొంటూ వెళ్లిపోయింది. దీంతో తీవ్రగాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానిక ఆటో డ్రైవర్ల ద్వారా తెలుసుకున్న ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉదయగిరిలో చోరీ

ఉదయగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కరీమావీధిలో గల ఓ నివాసంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు ధ్వంసం చేసి పది సవర్ల బంగారు నగలు, రూ.30 వేల నగదు అపహరించిన సంఘటన శనివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కరీమావీధికి చెందిన మీరా మొహిద్దీన్, షేక్ సుభానిఖాదురున్నీసా భార్యాభర్తలు. మీరామొహిద్దీన్ బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లగా భార్య ఒక్కటే ఉంటోంది. ఈ తరుణంలో రోజులాగే సుభాని ఖాదురున్నీసా పట్టణంలోని తన బంధువుల నివాసంలో నిద్రపో యేందుకు వెళ్లింది. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు గోడ దూకి ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించారు. అనంతరం బెడ్‌రూం గది తాళాలు పగలగొట్టి లోపల ఉన్న బీరువా తాళాలు తీసి అందులో ఉన్న గాజులు, కమ్మలు, ఉంగరాలు, ముక్కుపుడకలు తదితర బంగారు వస్తువులు సుమారు పది సవర్లు, వెండి వస్తువులతోపాటు రూ.30 వేల నగదు దోచుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన సుభానిఖాదరున్నీసా చోరీ జరిగిందని గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చింది. వారు విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో నివాసానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం నివాసంలో వేలిముద్రలను సేకరించారు. చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బైక్ చోరీపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్ చోరీపై నగరంలోని చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదుచేశారు. పోలీసుల సమాచారం మేరకు, తిప్పరాజువారివీధిలో ఆర్ రమేష్‌బాబు నివాసం ఉంటున్నారు. ఆయనకు పల్సర్‌బైక్ ఉంది. గత నెల 18 రాత్రి తన బైక్‌ను ఇంటిముందు పార్క్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించుకుని వెళ్లారు. ఈ మేరకు బాధితుడు శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి నగదు దోచేశారు!

నెల్లూరు(క్రైం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం కార్డును మార్చేసి ఖాతాలోని నగదును గుర్తుతెలియని దుండగుడు దోచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, నగరంలోని వైఎస్ఆర్‌నగర్‌కు చెందిన జ్యోతికి నిప్పో సెంటర్‌లోని ఎస్‌బీఐలో ఖాతా ఉంది. గతనెల 24న ఆమె భర్త వెంకటేష్‌తో కలిసి ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగుడు నగదు డ్రా చేసి ఇస్తానని వారి ఏటీఎం కార్డును తీసుకుని పిన్‌నెంబర్ తెలుసుకున్నాడు. అనంతరం నకిలీ ఏటీఎం కార్డును వారికి ఇచ్చి పనుందంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటికే బ్యాంకు ఖాతా నుంచి రూ.15 వేల నగదు డ్రా అయినట్లు జ్యోతి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితులు శనివారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగల చోరీపై ఫిర్యాదు

ఉదయగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తన బ్యాగులో ఉంచిన బంగారు నగలు చోరీకి గురయ్యాయని వరికుంటపాడు మండలం జడదేవి గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ పులివర్తి రామన్‌జ్యోతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల మేరకు.. విధుల్లో భాగంగా గతనెల 23న రామన్‌జ్యోతి తెల్లవారుజామున స్వగ్రామం నుంచి విజయవాడ బస్సెక్కి ఉదయగిరికి బయలుదేరింది. బస్సు దిగి డ్యూటీకి వెళ్లేందుకు సిద్ధమై బ్యాగును పరిశీలించగా అందులో ఉన్న బంగారు సరుడు, తాళిబొట్టు కనిపించలేదు. చోరీకి గురయ్యాయని తెలుసుకుని అప్పట్లో పోలీసులకు ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ సూచించింది. పోలీసులు అతన్ని విచారించగా ఏమీ తేలలేదు. అనంతరం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ముసునూరు వద్ద కారు, లారీ ఢీ

● త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



లారీ ఢీకొనడంతో డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

కావలిరూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ముందు వెళ్తున్న కారును వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. లేకుంటే పెను ప్రమాదం జరిగేది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన నల్లావుల అఖిల్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబంతో కలసి కావలి వచ్చిన అఖిల్ తన కారులో భార్య, పిల్లలను నెల్లూరులోని అత్తగారిటి దగ్గర వదిలిపెట్టి స్నేహితుడితో కలసి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని ముసునూరు టోల్‌గేట్ దాటిన తరువాత కారును వెనుక వైపున వచ్చిన సిమెంట్ మిక్సర్ లారీ వేగంగా ఢీకొంది. దీంతో అదుపుతప్పిన కారు డివైడర్ పైకెక్కి మధ్యలో ఆగిపోయింది. దీంతో కారులో ఉన్న అఖిల్‌తో పాటు అతని స్నేహితుడు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. లారీ డ్రైవర్ పూటుగా మద్యం సేవించి లారీ నడపటమే ప్రమాదానికి కారణమని, కారు డివైడర్ దాటి ఉంటే పెను ప్రమాదం జరిగేదని బాధితులు వాపోయారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్కపాళెంలో ఇనుప రాడ్‌తో దాడి

వెంకటాచలం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో ఇద్దరిపై ఇనుపరాడ్‌తో దాడి చేసిన ఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇస్కపాళెనికి చెందిన కురుగొండ పద్మమ్మ, ఆమె కుమారుడు వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన తాటిపర్తి వెంకటేశ్వర్లు ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కుటుంబ సభ్యులు వెంకటాచలంలోని సీహెచ్‌సీకి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పద్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 475

పారిశుధ్య కార్మికులపై మేస్త్రీల పెత్తనం నియంత్రించాలి

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు పట్టణ పరిశుభ్రత కోసం ఎంతో కష్టపడుతుండగా కొందరు మేస్త్రీల పేరుతో ఏమాత్రం పనిచేయకుండా కార్మికులపై పెత్తనం చెలాయించటం తగదని, తక్షణం వారిని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్‌చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సంఘం నాయకురాలు కాకుమాని రమణమ్మ అధ్యక్షతన ఏఐటీయూసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు కె.మురళీకృష్ణ, వై.ఆనంద్‌మోహన్‌లు మాట్లాడారు. శానిటరీ ఇన్స్‌పెక్టరు కొండయ్య పట్ల వివక్ష చూపుతూ నాలుగు నెలలుగా జీతం నిలిపివేయటం సరికాదని, తక్షణం ఆయన జీతం చెల్లింపునకు కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మందాటి చెరువుకు మహర్దశ


మట్టి తోలి వెడల్పు చేసిన చెరువు కట్ట

కావలి పట్టణం ముసునూరు సమీపంలో ట్రంకురోడ్డుకు ఆనుకుని ఉన్న మందాటి చెరువుకు మహర్దశ పట్టనుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. చెరువుకు ఆనుకుని పడమర వైపు రైల్వే ట్రాక్, తూర్పువైపు ట్రంకురోడ్డు, మధ్యలో 100 ఎకరాల్లో విస్తరించి ఉంది. చెరువు కట్టకాను కుని హనుమత్ క్షేత్రం, పడమర వైపు శ్రీసాయి క్షేత్రం, దక్షిణం వైపు అయ్యప్పస్వామి ఆలయాలు ఉన్నాయి. దీంతో మందాటి చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కావలి మాస్టర్ ప్లాన్‌లో గతంలోనే చేర్చినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం చెరువు కట్ట కిరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేసి కట్టను 40 అడుగుల వరకు వెడల్పు పనులు, కట్టకింది భాగంలో మట్టితో లెవలింగ్ పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయి. ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేలా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చర్యలు చేపట్టారు.

- కావలి (టౌన్,ఆంధ్రజ్యోతి)

అడవిని తలపిస్తున్న శ్మశాన వాటిక!


వలేటివారిపాలెం శ్మశానంలో దట్టంగా పెరిగిన ముళ్లచెట్లు

వలేటివారిపాలెం శ్మశాన వాటికలో ముళ్లచెట్లు దట్టంగా పెరిగి అడవిని తలపిస్తోంది. మృతదేహాన్ని తీసుకుని శ్మశానం లోపలికి వెళ్లేందుకు అవకాశం లేనంతగా పెరిగిన ముళ్లచెట్లతో కష్టాలు తప్పడం లేదు. సుమారు 5 ఎకరాలు ఉన్న శ్మశాన స్థలం ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడం, 15 ఏళ్లుగా కనీసం ముళ్లచెట్లు కూడా తొలగించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ముళ్ల చెట్ల మధ్య మృతదేహాలను ఖననం చేయడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఆ ముళ్ల చెట్ల మధ్య విష సర్పాలు సంచరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత పంచాయతీ అధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చే నిధులతో శ్మశానంలో ముళ్లచెట్లు తొలగించవచ్చు. కానీ ఆ దిశగా పాలకులు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శ్మశానంలో ముళ్లచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి)

'రాళ్లపాడు-రోళ్లపాడు' ప్రధాన పైపులైన్ లీక్


మంచినీటి పథకం పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు

లింగసముద్రం మండలంలోని పెంట్రాల సచివాలయం ఎదురుగా ఉన్న రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకంకు చెందిన ప్రధాన పైపులైన్ లీకై నీరు వృథాగా పోతోంది. సుమారు ఐదారు నెలల క్రితం ఈ పైపులైన్ పగిలి పోయింది. అప్పుడు మంచినీటి పథకం నిర్వాహకులు, సిబ్బంది పైపులైన్ పగిలిన చోట కొత్త పైపు వేశారు. ఆ తర్వాత కూడా ఈ పైపులైన్ నుంచి నీరు లీకవుతోంది. అయితే మంచినీరు విడుదలైనప్పుడు పైపులైన్‌లో ఇక్కడ నిల్వ ఉన్న నీరు మళ్లీ పైపుల్లోకి వెళ్లి మురుగు నీరు వస్తోందని గ్రామస్థులు పలువురు తెలిపారు. అంతేగాక ఈ మంచినీరు కూడా దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. అలాగే పెంట్రాల సచివాలయం దగ్గర నివశించే పేరం సింగయ్య ఇంటి ఎదురుగా ఉన్న అంతర్గత మంచినీటి పైపులైన్ పగిలి ప్రతినిత్యం నీరు ఇంటి ముందు నిల్వ ఉంటోంది. దీంతో ఆ ప్రాంతం దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

5న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్, సివిల్ విభాగాలలో మిగిలి ఉన్న సీట్లుకు ఈనెల 5న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలీ సెట్ రాసిన వారితో పాటు రాయని విద్యార్థినీ విద్యార్థులు సైతం పదవ తరగతి ఉత్తీర్ణులై ఉంటే ఈ స్పాట్ అడ్మిషన్ ద్వారా పాలిటెక్నిక్‌లో ప్రవేశించవచ్చునని తెలిపారు. 5న ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో హాజరుకావచ్చునన్నారు. సీటు పొందిన విద్యార్థులు వివిధ ఫీజుల నిమిత్తం రూ. 6వేలు చెల్లించాల్సి ఉంటుందని, వీరికి ఎలాంటి స్కాలర్‌షిప్‌లకు అర్హత ఉండదని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాక్షిక అంతరాయాలు ఏర్పడుతున్నందున ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్వామిత్వ గ్రామాల ఎంపిక

వలేటివారిపాలెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండసముద్రం, పోలినేనిపాలెం, కాకుటూరు, పోలినేనిచెరువు, రామలింగాపురం, శామీరపాలెం, నలదలపూరు గ్రామాలు స్వామిత్వ గ్రామాలుగా ఎంపికైనట్లు ఎంపీడీవో నరేంద్రదేవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాల్లో ప్రతి ఇల్లు, ఖాళీ స్థలాలు కొలతలు నమోదు చేసి వారికి చట్టబద్ధమైన ఆస్తి హక్కు ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కొండసముద్రం, పోలినేనిపాలెం గ్రామ సచివాలయాల్లో స్వామిత్వ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అనుమోల అమరేశ్వరి, మన్నం వెంగమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

157 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 313 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 157 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్-5, నోబిడ్-135, ఆర్ఆర్-1, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 156 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.205.25గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.9,64,157

వలేటివారిపాలెం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.9,64,157 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో ఉన్న స్కానింగ్ సెంటర్లను వైద్యాధికారుల బృందంతో కలిసి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు పద్మజ శనివారం తనిఖీ చేశారు. ఆమెవెంట డాక్టరు శైలజ, డాక్టరు కొండయ్య, సామాజిక ఆరోగ్య అధికారి జి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

కావలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) 25వ ఆవిర్భావదినోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం బీటీఏ కార్యాలయం లైన్‌లో ఉన్న కావలి పెన్షనర్స్ భవనంలో జరుగుతాయని బీటీఏ రాష్ట్ర కార్యదర్శి వై.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 31,853 మంది, పీఎం కిసాన్ పథకం కింద 29074మంది రైతులకు ఆర్థికసహాయం మంజూరైందని తెలిపారు. మండలంలోని పలుకూరులో శనివారం సాయంత్రం అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ తొలివిడత నిధులు విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చెక్కు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం తొలివిడతగా రూ.5వేలు, పీఎం కిసాన్ రూ.2వేలు రైతుల ఖాతాలకు జమ అయ్యాయని, ఈ నిధులు పెట్టుబడులకు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలోని రైతులకు 21 కోట్ల 73లక్షల 13వేల రూపాయలు రైతులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆరువేలకు మరో 14వేలు కలిపి ప్రతిఏటా రైతులకు రూ.20వేలు ఆర్థిక తోడ్పాటు అందిస్తామన్నారు. తొలివిడతగా రూ. 7వేలు రైతుల ఖాతాలకు జమచేశారని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం కేవలం రూ. 7500 సహాయం అందించగా ప్రస్తుతం చంద్రబాబునాయుడు రూ.14వేలు అందజేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శేషారెడ్డి, అబ్దుల్‌రహీం, టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, దామా మల్లేశ్వరరావు, పూరిమిట్ల మాల్యాద్రి, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహ్మం, నార్నె రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి


తృణధాన్యాలతో ఏర్పాటు చేసిన పకృతి వ్యవసాయ చక్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, వ్యవసాయశాఖ అధికారులు

కావలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కావలి నియోజకవర్గంలో ప్రతి రైతుకు అండగా ఉంటానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఓ కల్యాణ మండపంలో శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కావలి నియోజకవర్గంలోని 18,500 కుటుంబాలకు తొలివిడతగా విడుదలైన రూ.12,03,55,000 మెగా చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపుల ఊబిలో కూరుకున్న ప్రభుత్వాన్ని చంద్రబాబు గాడిలో పెట్టి ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూవస్తున్నారన్నారు. సంక్షేమానికి ఎన్టీఆర్, అభివృద్ధికి చంద్రబాబు నాయుడులు బీజం వేశారన్నారు. గత పాలనలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని బస్తాకు 5 కిలోల పైన తరుగు తీసుకుని సకాలంలో డబ్బులు ఇవ్వకుండా రైతులను నష్టాలుపాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల ధాన్యానికి ఎలాంటి తరుగు లేకుండా వెంటనే డబ్బులు చెల్లిస్తూ రైతుల పక్షపాతిగా నిలిచామన్నారు. తొలుత వివిధ రకాల తృణధాన్యాలతో అందంగా తీర్చిదిద్దిన ప్రకృతి వ్యవసాయ చక్రంను ఎమ్మెల్యే, అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏడీఏ నాగరాజు, ప్రకృతి వ్యవసాయం పీడీ రాజశేఖర్, తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీదేవి, నాయకులు పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, జ్యోతి బాబూరావు, మాలేపాటి నాగేశ్వరరావు, ఆవుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం


కావలి : పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

కావలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయని ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య తెలిపారు. పట్టణంలోని ముసునూరు అంగన్‌వాడీ కేంద్రాల సముదాయంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో పోషక విలువలు కలిగిన ఆహార పాదార్థాలపై అవగాహన కల్పిస్తూ వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. శివలీల, రమాదేవి, ప్రభావతి, ఎం.సుశీలకుమారి, సుకన్య, మహిళా సంరక్షణ కార్యదర్శి పుష్పలత, ఏఎన్ఎం బేబీరాణి, ఆశావర్కర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.


లింగసముద్రం : మొగిలిచెర్లలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి

● లింగసముద్రం(ఆగస్టు) : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి చెప్పారు. మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలోని 3వ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏ మార్తమ్మ, సులోచన, ప్రసన్న, ఓబులమ్మ, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి): పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని నూకవరం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, భారతి, మనోహర్, రమ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి


పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

కావలి(టౌన్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి) : మువ్వన్నెల జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య 149వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు. శనివారం పట్టణంలోని డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్, వైద్యరత్న డాక్టర్ ప్రభాకర్ నాయుడు పాల్గొని పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుభాషా కోవిదుడు, స్వాతంత్ర సమరయోధుడు, ప్రపంచం గర్వించదగ్గ తెలుగు జాతి ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య అన్నారు. ఆగస్టు 15న దేశవ్యాప్తంగా రెపరెపలాడనున్న జాతీయ జెండాలో ప్రతి భారతీయుని ఆత్మాభిమానం కనపడేలా రూపొందించడం తెలుగువారికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షుడు ఎస్కే ఖాదర్‌బాషా, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎంవీ ప్రసాదరావు, రాయపాటి దిలీప్, జీ.సురేంద్ర, సలీంబేగ్, సయ్యద్ ఘనీబాషా, మధుసూదన్‌రావు, షేక్ జమీర్ పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం


వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న ఆయుష్ వైద్యుడు చంద్రశేఖర్

జలదంకి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీకే అగ్రహారంలో శనివారం ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ విజయకుమారిలు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, గ్రామస్థులు జలదంకిలో ఉన్న ప్రభుత్వ ఆయుష్‌కేంద్రానికి వచ్చి తమకు అవసరమైన పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు


విదార్థినికి ఫ్లోరోసిస్ పరీక్ష చేస్తున్న వైద్యాధికారి దివ్య

కొండాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి, సత్యవోలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు శనివారం ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించారు. ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంటు వైద్యాధికారిణి దివ్య మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదివే విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించామన్నారు. ఈ కార్యక్రమంపై పీహెచ్‌సీ సిబ్బందికి కమ్యూనిటీ సర్వే శిక్షణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు నసీరుద్దీన్, కవిత, సీహెచ్‌వో చెంచు రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం లో పీహెచ్‌సీ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న చెత్తను పంచాయతీ కార్యదర్శి మురళి పారిశుధ్య సిబ్బందిచే శనివారం తొలగింప చేశారు. రోడ్డు పక్కనే చెత్త అని శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. అనంతరం రోడ్డు పక్కన చెత్తను వేయవద్దని దుకాణదారులకు సూచించారు. చెత్తను చెత్తబండిలోనే వేయాలని అలా కాకుండా చెత్తను రోడ్ల పక్కన వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఇళ్లలోకి ఎలా చొరబడతారు?

● పోలీసులకు తెల్లగుంట వాసుల ఫిర్యాదు



పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న తెల్లగుంట గ్రామస్థులు

బిట్రగుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గుంపులు గుంపులుగా ఇళ్లలోకి చొరపడి దురుసుగా ప్రవర్తించడం ఏమిటని బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట వాసులు అన్నారు. శనివారం సాయత్రం ఎస్సీపాలెంకు చెందిన కొందరు తెల్లగుంట దళితవాడలో ఇళ్లలోకి జొరబడి దౌర్జన్యం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ప్రభాకర్‌రావు కథనం మేరకు.. తెల్లగుంట దళితవాడకు చెందిన బొందు తిరుపతి కుమారుడు వంశీకృష్ణ ఎస్సీపాలెంకు ఓ యువతిని మూడు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆ యువతిని గ్రామంలో దాచి ఉంచారన్న అనుమానంతో ఎస్సీపాలెంకు చెందిన కొందరు ఇళ్లలోకి చొరబడి దుర్భాషలు ఆడుతూ దురుచుగా ప్రవర్తించారు. అంతకు ముందు శుక్రవారం ఆ యువతి తల్లిదండ్రులు తమ బిడ్డతో ఒక్కసారి మాట్లాడేందుకు పిలిపించమని ఎస్ఐని కోరారు. ఈ మేరకు వారితో మాట్లాడగా తీసుకువస్తామన్న పెద్ద మనుషుల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఇరువర్గాలు సర్దుకుపోయారని పోలీసులు భావించారు. ఇంతలో ఇళ్లలోకి జొరబడి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ మేరకు విచారించి తగు చర్యలు చేపడతామని ఎస్ఐ తెలిపారు. దీంతో వారు శాంతించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్‌టీఐ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


జిల్లాలో మొదటి బహుమతి సాధించిన సైదాబీ

కందుకూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టం (ఆర్‌టీఐ) అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీఐకు సంబంధించిన అంశాలతో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేటు, వక్తృత్వ పోటీలు నిర్వహించగా తమ కళాశాల విద్యార్థిని ఎస్కే సైదాబీ జిల్లా మొదటి బహుమతి దక్కించుకుందని తెలిపారు. అలాగే కళాశాల విద్యార్థులు ఆర్.మహేష్, కే.శివకుమార్, ఎస్కే సైదాబీలతో కూడిన క్విజ్ జట్టు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుందని తెలిపారు. మొదటి బహుమతి సాధించిన సైదాబీ ఈనెల 6న గుంటూరులో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు అభినందించారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు

నెల్లూరు (లీగల్), అగస్టు 2(ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో శని వారం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్ర మానికి అధ్యక్షత వహించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకు నేందుకు స్తోమతలేని వరంగల్‌కు చెందిన గండిబోయిన దివ్యకు దాతల సహకారంతో ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే.వాణి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, సైకాలజిస్ట్ డాక్టర్ కరిమద్దల నరసింహారెడ్డి పాల్గొన్నారు

బళ్లారి రాఘవకు ఘన నివాళి


బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ

అల్లూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి రాఘవ జయంతి వేడుకలు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కార్యక్రమాలపై వివరించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మృదుల, ఇన్‌చార్జి ఎంపీడీవో పెంచల వీరేంద్ర, ఏవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక్కడ గ్రావెల్..



మన్నారుపోలూరులోని ఓ వెంచర్‌లో గ్రావెల్‌ను అన్‌లోడ్ చేస్తున్న టిప్పరు.. చదును చేస్తున్న దృశ్యం

చీకటి పడితే చాలు.. ఆ వెంటనే ఎక్స్‌కవేటర్ల రొద మొదలవుతుంది. ప్రభుత్వ భూమిని చీల్చి గ్రావెల్‌ను తవ్వుతాయి. టిప్పర్లు రయ్‌మంటూ పరుగులు తీస్తాయి. ఇలా పూలతోటమిట్టలో మొదలయ్యే గ్రావెల్ అక్రమ రవాణా సూళ్లూరుపేట, తడ ప్రాంతాలకు సాగుతోంది. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

అక్కడ ఇసుక



అరుణా నదిలో ఇటీవల ఇసుక తరలింపు, ఇటీవల చేపట్టిన తవ్వకాలు

'ఉచితం' మాటున నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వేస్తున్నారు. పగలంతా ఒక ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. రాత్రిళ్లు రాష్ట్ర సరిహద్దులు దాటించి తమిళనాడుకు తీసుకెళుతున్నారు. ఇలా రాత్రింబవళ్లు ఇసుక దందా సాగిస్తున్నా అధికారులు కిమ్మనడంలేదు. - సత్యవేడు, ఆంధ్రజ్యోతి

చీకటి పడితే చకచకా

● పూలతోటమిట్ట నుంచి సూళ్లూరుపేటకు యథేచ్ఛగా అక్రమ రవాణా

సూళ్లూరుపేట డివిజన్‌లో గ్రావెల్ దోపిడీ ఆగడం లేదు. గ్రావెల్ అక్రమ రవాణాతో మాఫియా మళ్లీ చెలరేగిపోతోంది. కొంతకాలం స్తబ్దుగా ఉన్న అక్రమార్కులు అందిన కాడికి దోచుకుంటున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా గ్రావెల్‌ను అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. సీజేఎస్ఎఫ్, అసైన్డ్ భూముల్లో ఎక్స్‌కవేటర్లతో సాయంతో రాత్రికిరాత్రే గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్‌ను తవ్వి టిప్పర్లలో నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇలా దొరవారిసత్రం మండలం పూలతోటమిట్ట నుంచి సూళ్లూరుపేట, ఇతర ప్రాంతాలకు అక్రమంగా గ్రావెల్ తరలించి రూ.లక్షలు ఆర్జిస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇంటి అవసరాల కోసం కొంత గ్రావెల్ తవ్వుకుంటే కేసులు నమోదు చేసే అధికారులు ఈ అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూళ్లూరుపేటలో కొత్తగా ఏర్పాటు చేసే రియల్ ఎస్టేట్ వెంచర్లకు, కొన్నిచోట్ల పరిశ్రమలకు పెద్ద మొత్తంలో గ్రావెల్ అవసరమవుతోంది. దీన్ని అవకాశంగా తీసుకుని కొంతమంది అక్రమార్కులు రాజకీయ నేతల పలుకుబడితో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తున్నారు. పూలతోటమిట్టలో అసైన్డ్, సీజేఎస్ఎఫ్ భూముల్లో చీకటిపడితే చాలు ఎక్స్‌కవేటర్ల సాయంతో గ్రావెల్ తవ్వి పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా సూళ్లూరుపేట, తడ, శ్రీహరికోట ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడ దొరికే గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కులకు కలిసివచ్చింది. చీకటిపడితే చాలు దొరవారిసత్రం నుంచి సూళ్లూరుపేట వరకు గ్రావెల్ అక్రమ రవాణాచేసే టిప్పర్లు రయ్..రయ్ అంటూ తిరుగుతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ గ్రావెల్‌ను మన్నారుపోలూరు, శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో ఉండే వెంచర్లకు తోలి చదును చేస్తున్నా మౌనం వెనుక అర్థం అంతర్యం ఏమిటో? ఇప్పటికైనా అధికారులు గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

రాత్రింబవళ్లూ తవ్వేస్తున్నారు

● అరుణా నది నుంచి తమిళనాడుకు ఇసుక తరలింపు

నాగలాపురం మండలం నందనం వద్ద అరుణానదిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నదిలో నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అరుణానది నారాయణవనం మండలంలోని కాకముఖ కొండల్లో పుట్టి నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా ప్రవహిస్తూ, సురుటుపల్లె వద్ద తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి యాభై కిలోమీటర్ల మేర ప్రయాణించి ఎణ్నూరు వద్ద బంగాళఖాతంలోకి కలుస్తుంది. అరుణానది పరీవాహక ప్రాంతమంతా పచ్చని పంట పొలాలతో, బంగారు కాంతులు వెదజల్లుతూ మేటలు వేసిన ఇసుక తిన్నెలతో ప్రకృతి శోభను సంతరించుకుని కన్నులపండువగా ఉండేది. ఇదంతా గతం. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అరుణానదికి గర్భశోకం మొదలైంది. అడ్డగోలు అనుమతులతో ఐదేళ్ల పాటు రాత్రి, పగలు సాగిన వైసీపీ నేతల అక్రమ తవ్వకాలతో అరుణానది తన ఆనవాళ్లను కోల్పోయింది. పెద్ద పెద్ద హిటాచీలు, ఎక్స్‌కవేటర్‌లతో నదీగర్భంలో ఇరవై అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వి రోజుకు వందలాది లారీలతో ఇసుకను సరిహద్దు దాటించారు. ఫలితంగా అరుణానది పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు భారీగా అడుగంటాయి. కూటమి అధికారంలోకి వచ్చాక కొన్ని రోజులు స్తబ్దుగా ఉన్న ఇసుక మాఫియా మళ్లీ జూలు విదిలిస్తోంది.ఉచిత ఇసుక మాటున ట్రాక్టర్ల యజమానుల నుంచి ఇసుకను కొనుగోలు చేస్తూ మామిడి తోటలు, రహస్య ప్రాంతాల్లో భారీగా డంప్ చేసుకుని రాత్రికి రాత్రే తమిళనాడు, బెంగళూరుకు తరలిస్తున్నారు.ఉచిత ఇసుక విధానంలో యంత్రాలు వాడకూడదన్న నిబంధన ఉంది. ఈ నిబంధన ఉల్లంఘించి పట్టపగలే ఇసుక తవ్వుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటో?.

అక్రమ రవాణా ఇలా..

ప్రధానంగా అరుణా నది పరీవాహక ప్రాంతాల్లోని నాగలాపురం మండలం నందనం, సుబ్బానాయుడుకండ్రిగ, బయటకొడియంబేడు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తవ్వి గోపాలపురం, జడేరి, ఏఎంపురం మార్గాల్లో తమిళనాడుకు అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. పిచ్చాటూరు మండలం అప్పలరాజు కండ్రిగ, పులికుండ్రం, అడవి కొడియంబేడు, ఎస్ఎస్‌బీ పేట, అప్పంబట్టు గ్రామాల నుండి సీతంజేరి, ఊత్తుకోట్టై మీదుగా తమిళనాడుకు తరలిస్తున్నారు. నారాయణవనం మండలంలో తుంబూరు, అరణ్యంకండ్రిగ తదితర గ్రామాల నుంచి విజయపురం మీదుగా తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా పరిశ్రమల నిర్మాణం పేరుతో చెదులుపాక్కం మీదుగా ఇసుకను చెన్నైకు అక్రమంగా రవాణా చేస్తున్నారు.



సత్యవేడులో ఇటీవల పట్టుబడిన ఇసుక డంప్

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సు పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డీఆర్వో నరసింహులు అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రెండు కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 641మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు అభ్యర్థులు గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని తెలిపారు. అభ్యర్థుల కోసం ఆర్టీసీ అధికారులు ఆయా సమయాల్లో ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. సమావేశంలో కుమార్ శ్రీవాస్తవ(ఢిల్లీ),జాయింట్ సెక్రటరీ శివకుమార్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు

1. శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాల, బాలాజీ కాలనీ, తిరుపతి
2. శ్రీపద్మావతి ఉమెన్స్ జూనియర్ కాలేజీ(వింగ్-ఏ), పద్మావతి గెస్ట్ హౌస్ దగ్గర, తిరుపతి

11న రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈ నెల 11న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో పెద్దయెత్తున రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. పలుచోట్ల రైతుల భూ రికార్డులు తారుమారయ్యాయి. దీనిపై ఏడాది నుంచి పలుమార్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజాదర్బార్ ద్వారా వినతిపత్రాలు స్వీకరించారు. అందులో కొన్ని మాత్రమే పరిష్కారమయ్యాయి. ఈ విషయమై పలుమార్లు ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి విన్నవించారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీకాళహస్తిలో రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించేందుకు నిర్ణయించారు. 11న చేపట్టనున్న కార్యక్రమంలో సమస్యలను పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు.

1,54,980 మంది రైతులకు రూ.105కోట్లు

● రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నిధుల జమ



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఏపీసీడ్స్ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు మెగా చెక్కును, విత్తనాల కిట్లను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేలా తొలివిడత నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 1,54,980 మంది రైతుల ఖాతాల్లో రూ.105కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 90శాతం ఇన్‌పుట్ సబ్సిడీతో యూరియా, పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తోందన్నారు. క్రాప్ ఇన్సూరెన్సు అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 22వేల మంది రైతులు లబ్ధి పొందారని చెప్పారు. రైతులకు కూలీల సమస్యను నివారించేందుకు పది డ్రోన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకంపై గ్రీవెన్సు నిర్వహించారు. పథకానికి సంబంధించి సమస్యలు ఉంటే 9552300009 ద్వారా వాట్సాప్‌లో వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, రైతు సంఘాల నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో స్మార్ట్ కార్డులు సిద్ధం

● 15 లేదా 25 నుంచి పంపిణీ చేయనున్న అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం సరికొత్త విధానాలతో రేషన్ కార్డులు తయారు చేస్తోంది. నిత్యావసర సరుకులు తీసుకోవడానికే కాకుండా అన్ని సంక్షేమ పథకాలకు ఉపయోగపడే విధంగా సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు మోటారు వాహనాల లైసెన్సులు, ఆధార్ కార్డుల తరహాలో స్మార్ట్ కార్డులను రూపొందించారు. కార్డు మీద ఇంటి యజమాని ఫొటో, కుటుంబ సభ్యుల పేర్లు, రాజముద్ర, క్యూఆర్ కోడ్ ఉంటుంది. వీటిని ఈనెల 15 లేదా 25వ తేదీ నుంచి పౌరసరఫరాల శాఖ అధికారులు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 1,632 రేషన్ షాపుల పరిధిలో 6.25 లక్షల తెల్ల రేషన్ కార్డులున్నాయి. ఇప్పటివరకు రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులందరి ఫొటో ఉండేది. ఇప్పుడు ఆ స్థానంలో కుటుంబ యజమాని ఫొటో ఉంటుంది. సభ్యులవి పేర్లు మాత్రమే నమోదు చేస్తారు. గతంలో రైస్ కార్డులపై అధికారంలో ఉన్న సీఎం ఫొటో ఉండేది. తాజా స్మార్ట్ కార్డుల్లో ప్రభుత్వ చిహ్నం మాత్రమే ఉంటుంది. ఇవి బ్యాంకు డెబిట్ కార్డులను తలపిస్తాయి. పారదర్శకతతో రేషన్ సరకులు పంపిణీ చేయడానికి వీలుగా క్యూఆర్ కోడ్ ద్వారా డైనమిక్ కీ రిజిస్టర్‌తో వీటిని అనుసంధానం చేస్తారు. తద్వారా రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని పేర్కొన్నారు.

పాఠశాలల్లో అనధికార వ్యక్తులకు నో ఎంట్రీ : డీఈవో

తిరుపతి(విద్య), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోకి అనధికార వ్యక్తులకు ప్రవేశాన్ని నిషేధించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాబోధనకు ఆటంకం కలుగకుండా, విద్యార్థుల భద్రత,విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తప్ప ఇతర వ్యక్తులు, సంస్థలు, సంఘాలకు చెందిన వారు పాఠశాలల ఆవరణలోకి ప్రవేశించరాదని పేర్కొన్నారు.రాజకీయ పార్టీల కరపత్రాలు, జెండాలు, కండువాలు, బ్యానర్లు, పోస్టర్లను ప్రదర్శించరాదని తెలిపారు.

14న డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం నిర్వహించే డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 14వ తేదీ స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వీసీ కృష్ణమూర్తి కోరారు.

తిరునగరికి తగ్గనున్న ట్రాఫిక్ సమస్య

● విమానాశ్రయానికి పెరగనున్న కనెక్టివిటీ ● రూ. 113 కోట్లతో ఎన్‌హెచ్ పనులకు శంకుస్థాపన

తిరుపతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ. 113 కోట్లతో రెండు నేషనల్ హైవేస్ ప్రాజెక్టు పనులకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శనివారం మంగళగిరి నుంచీ సీఎం చంద్రబాబుతో కలసి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మదనపల్లె-నాయుడుపేట రోడ్డు బైపాస్ సెక్షన్‌కు సంబంధించి ఎన్‌హెచ్ 71లో తిరుపతి నగర శివార్లలో 22 కిలోమీటర్ల మేరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ. 22 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనుల కింద రోడ్డు మార్కింగ్, ట్రాఫిక్ సైన్ బోర్డులు, సోలార్ బ్లింకర్లు వంటివి ఏర్పాటు చేయాల్సి వుంది.తిరుపతి వెలుపల పూతలపట్టు-నాయుడుపేట రోడ్డును మదనపల్లె - తిరుపతి రోడ్డును కలిపే ఈ రోడ్డు పనులు పూర్తయితే తిరుపతి నగరంపై మదనపల్లె వైపు నుంచీ ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. మదనపల్లె వైపు నుంచీ వచ్చే వారు రేణిగుంట రైల్వే జంక్షన్‌కు, విమానాశ్రయానికి త్వరగా చేరుకోగలుగుతారు. ప్రయాణ వ్యవధితో పాటు కాలుష్యం కూడా తగ్గుతుంది. కాగా శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద, తడ-నెల్లూరు ఎన్‌హెచ్ 16వ సెక్షన్‌లో చిల్లకూరు సెంటర్ వద్ద రెండు కిలోమీటర్ల మేరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ. 91 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే పనులకు నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఈ రెండు చోట్లా ఫోర్ లేన్ స్థాయిలో రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. ఆ పనుల్లో భాగంగా ఆరు చోట్ల బాక్సు కల్వర్టులు, రెండు చోట్ల పైప్ కల్వర్టులు, ఒక బస్ షెల్టర్ నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గనున్నాయి. కృష్ణపట్నం పోర్టుకు, షార్‌కు కనెక్టివిటీ పెరుగుతుంది. ప్రయాణ వ్యవధి, కాలుష్యం తగ్గుతాయి. ముఖ్యంగా స్కూలు పిల్లలకు, పాదచారులకు రోడ్డు ప్రమాదాల నుంచీ భద్రత కలగడమే కాకుండా చిల్లకూరు, శ్రీసిటీ జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి.

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలపై 5న సమావేశం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈనెల ఐదో తేదీన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ నేతృత్వంలో వివిధశాఖల అధికారులతో సమావేశం జరగనుందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఈ సమావేశంలో 21 రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిపారు.

వంద టెంకాయలు రూ.2,500

పాలసముద్రం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి కాయల ధర రికార్డుస్థాయికి చేరుకున్నాయి. వంద కొబ్బరికాయలను రైతుల వద్ద రూ.2,500లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పాలసముద్రం మండలంలో సుమారు మూడువేల ఎకరాల్లో విస్తారంగా కొబ్బరి తోటలున్నాయి. రెండు నెలలుగా కొబ్బరి ధరలు పెరుగుతూ ప్రస్తుతం వంద రూ.2,500 లకు చేరుకున్నాయి. రెండు నెలల కిందట వంద కొబ్బరి కాయలు రూ.15,00 పలికేవి. తమిళనాడు, కేరళ, మన రాష్ట్రంలో కొబ్బరి తోటలకు పిండెనల్లి తెగులు కారణంగా దిగుబడి తగ్గింది. దీనివల్లే ధరలు పెరిగినట్లు సమాచారం.

టౌన్ బ్యాంకులో గందరగోళం

ఎండీకి షోకాజ్ నోటీస్ ఇచ్చిన ఛైర్మన్

బోర్డుకు సంబంధంలేని అంశంపై ఛైర్మన్ జోక్యమేమిటంటున్న సిబ్బంది



శివకుమార్‌రెడ్డి

తిరుపతి(ఆటోనగర్),ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు (టౌన్ బ్యాంక్) కార్యకలాపాలు గందరగోళంగా మారుతున్నాయి. బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్‌రెడ్డికి ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో ఉద్యోగులు విధులు నిలిపి నిరసన తెలిపే పరిస్థితికి వచ్చింది. రూ.6.92 లక్షలు రుణగ్రస్తుల నుంచి రికవరీ చేయని అంశంపై చీఫ్ మేనేజరు వి.వెంకటేశన్,మేనేజరు పి.వినోద్ బాబుపై ఉన్న సస్పెన్షన్‌ను ఎండీ రద్దు చేశారు. తన దృష్టికి తీసుకురాకుండా విధుల్లోకి తీసుకున్నందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ఛైర్మన్ షోకాజ్ నోటీస్ ఇచ్చారు. అయితే సహకార చట్టం 51 మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు బ్యాంక్‌లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై విచారణ చేస్తున్నారు. విచారణలో తప్పు ఉంటే జీతం నుంచి రికవరీ చేయవచ్చని నిబంధన మేరకు సస్పెన్షన్ ఎత్తివేసినట్టుగా అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది పూర్తిగా పరిపాలన అంశమని,సహకార చట్టం నిబంధనల మేరకు నిర్ణయం తీసుకునే అధికారం ఎండీకి ఉంటుందని తెలుస్తోంది. పాలకమండలి సిఫారసు మేరకు విచారణ జరిగివుంటే వారి దృష్టికి తీసుకెళ్లాలి కానీ వ్యక్తిగత కక్షతో బ్యాంకు పరువు బజారుకీడ్చుతున్నారని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగులను ఇబ్బందిపెడితే విధులను బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు.

బీటెక్ (స్వీడన్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో బీటెక్ (స్వీడన్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. నాలుగేళ్ల బీటెక్ కోర్సులో భాగంగా మూడేళ్లు ఎస్వీయూలోనూ, చివరి ఏడాది స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదివే అవకాశం ఉంటుంది. ఈనెల 4 నుంచీ 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం ఎస్వీయూడీవోఏ.. వెబ్‌సైట్‌ను చూడవచ్చని రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


సుహాస్

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ హీరోలు ఆది, అశ్విన్‌బాబు, సుహాస్, సంగీత దర్శకుడు తమన్, డ్రమ్స్ శివమణి, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారులు ఎల్లా వెంకటేశ్వరరావు, తానా మాజీ అధ్యక్షుడు వీ సతీష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.


డ్రమ్స్ శివమణి, ఆది, అశ్విన్‌బాబు

స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందని వచ్చా

వచ్చేవారం నుంచి తాను తమిళంలో నటించబోతున్నానని, ఈ క్రమంలో స్వామిని దర్శించుకుంటే ధైర్యంగా ఉంటుందనే ఉద్దేశంతో తిరుమలకు వచ్చానని హీరో సుహాస్ తెలిపారు. దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారం రోజుల్లో తమిళ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందన్నారు.

కోదండరాముడికి స్వర్ణ తులసిహారం బహూకరణ

తిరుపతి అర్బన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామికి శనివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన దాత బంగారు తులసీహారం బహూకరించారు. రూ.26లక్షల విలువైన 257గ్రాముల పసిడితో తులసిదళాలు, వాటిపై గాయత్రి బీజాక్షరాలు పొందుపరిచారు. ఈ హారాన్ని దాత ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నకు అందజేశారు. విశేష ఉత్సవాలలో మూలవర్లకు దీన్ని అలంకరించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఆనందకుమార్‌దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.


హారంతో డిప్యూటీ ఈవో నాగరత్న


సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.65 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,353

తలనీలాలు సమర్పించినవారు: 25,636



అభిమానుల్లో ఉండే ఎనర్జీ నాలోనూ ఉంది

● 'కూలీ' ట్రైలర్ రిలీజ్ వేడుకలో రజనీకాంత్



చెన్నై, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అభిమానుల్లో ఉండే ఎనర్జీ తనలోనూ ఉందని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఆయన హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రూపొందిన 'కూలీ' చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక శనివారం రాత్రి చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాకు, సత్యరాజ్‌కు అభిప్రాయభేధాలుండొచ్చు, కానీ ఆయన మనసులో వచ్చిన మాటను నిర్మొహమాటంగా చెప్పి వెళ్లిపోతుంటారు. మనసులో ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవారిని నమ్మొచ్చు. కానీ, మనసులో ఒకటి, బయట ఒకటి పెట్టుకుని వుండేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మకూడదు' అన్నారు. 'ఎన్ని రోజులని నేను మంచిగా నటించాలి' అని హీరో అజిత్ కుమార్‌కు దర్శకుడు వెంకట్ ప్రభు ఒక డైలాగ్ రాశాడు. ఆ విధంగానే ఈ చిత్రంలో అక్కినేని నాగార్జున ఒక పాత్రలో నటించారు' అని రజనీకాంత్ అన్నారు.అనంతరం అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, 'ఒక కూలీ వంద బాషాలకు సమానం. నిజమైన సూపర్‌స్టార్ రజనీకాంత్. ఓజీ సూపర్‌స్టార్ అంటే రజనీకాంత్. యూ ఆర్ ది సూపర్ స్టార్ ఆఫ్ ది ఇండియన్ సినిమా' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. దర్శకుడు లోకేష్ కనకరాజ్ మాట్లాడుతూ, 'నా తండ్రి ఒక బస్సు కండక్టర్. ఆయన నంబరు 1421. ఆ నెంబరును ఈ సినిమాలో రజనీకాంత్‌కు ఉపయోగించాను. ఇది నా తండ్రికి నేను ఇచ్చే ఒక గౌరవంగా భావిస్తున్నా' అన్నారు.హీరోయిన్ శృతి హాసన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నాకు ఒక మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు లోకేశ్‌కు ధన్యవాదాలు. మా నాన్నకు 'విక్రమ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీని ఇచ్చినందుకు కృతజ్ఞతలు. ఆ చిత్రం నుంచి నేను మీ అభిమానిగా మారిపోయాను' అన్నారు. ఈ ఆడియో వేడుకల్లో బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాత కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14వ తేదీన తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్‌కానుంది.

ఫ్యాన్స్ అత్యుత్సాహం.. స్వల్ప తోపులాట : 'కూలీ' ఆడియో రిలీజ్ వేడుక జరిగిన నెహ్రూ ఇండోర్ స్టేడియం వద్ద రజనీకాంత్ అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు.వేడుకను తిలకించేందుకు పాసులున్నవారిని మాత్రమే అనుమతించారు. అయితే, పెద్ద ఎత్తున ఫ్యాన్స్ స్టేడియం వద్దకు చేరుకుని లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఒక దశలో అభిమానులంతా ఒక్కసారిగా ముందుకు తోసుకు వెళ్ళడంతో స్వల్ప తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఓ మహిళా కానిస్టేబుల్ కూడా కిందపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. పరిస్థితిని చక్కదిద్దారు.

నేడు స్నేహితుల దినోత్సవం



స్నేహం చూపిన ఔదార్యం

● ఎస్వీ వైద్య కళాశాలకు బాసట

తిరుపతి(వైద్యం), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వారంతా కలిసి చదువుకున్నారు. కాలం గడుస్తున్నా వారి స్నేహం చెక్కు చెదరలేదు. ఎక్కడెక్కడో ఉన్నా అప్పుడప్పుడయినా కలుస్తున్నారు. నాటి సంగతులను కలబోసుకుంటున్నారు. గురువులను సత్కరిస్తున్నారు. అక్కడితో ఆగిపోలేదు. తమను ఒక్కటి చేసిన స్నేహబంధం వారిలో సేవా దృక్పథాన్ని పెంచింది. తమను ఉన్నత స్థాయికి చేరేందుకు బాటవేసిన విద్యాలయాభివృద్ధికి చేతులు కలిపేలా చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీ వైద్య కళాశాలకు చెందిన కొందరు పూర్వ విద్యార్థులు కళాశాలకు బాసటగా నిలుస్తున్నారు. స్నేహితులుగా సేవా సుమాలను పూయిస్తున్నారు.


రూ.15 లక్షలతో కళాశాల క్రీడామైదానానికి ప్రహరీ, పెవిలియన్ నిర్మించిన 1991 బ్యాచ్ విద్యార్థులు

● ఎస్వీ వైద్య కళాశాలలో 2004లో వైద్య విద్యను పూర్తి చేసిన పలువురు ఇప్పటికే స్నేహ బృందంగా ఏర్పడ్డారు. అప్పుడప్పుడూ కళాశాలకు వస్తూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కళాశాలకు ఆర్థికపరంగా చేయూత అందిస్తున్నారు. ఇటీవల ఫార్మకాలజీ విభాగానికి అవసరమైన రూ.5 లక్షల విలువచేసే బీరువాలను, కంప్యూటర్లను అందజేశారు.


రూ. 5 లక్షలతో ఫార్మకాలజీ విభాగానికి ఫర్నిచర్‌ను అందజేసిన 2004 బ్యాచ్ స్నేహితులు

● కళాశాలలో 1991లో వైద్య విద్యను పూర్తి చేసిన మరో కొందరు విద్యార్థులు ఇప్పటికీ స్నేహన్ని కొనసాగిస్తూ కళాశాలపై ఉన్న మమకారం చాటుకుంటున్నారు. భవిష్యత్తు తరాల విద్యార్థుల కోసం రూ.15 లక్షలతో కళాశాల క్రీడా మైదానానికి ప్రహరీని, పెవీలియన్‌ను నిర్మించి ఔదార్యాన్ని ప్రకటించారు.

● 1987, 1995 బ్యాచ్ విద్యార్థులు కూడా స్నేహితుల సమూహంగా ఏర్పడ్డారు. కళాశాలలోని విద్యార్థులను కలిసేందుకు వచ్చే తల్లిదండ్రులు వేచి ఉండేందుకు అవసరమైన రెండు ప్రత్యేక గదుల నిర్మాణానికి రూ.15 లక్షలు అందజేశారు. అవసరమైన పూర్తి ఫర్నీచర్‌ను సమకూర్చారు.

● కళాశాలకు చెందిన 1993 బ్యాచ్ స్నేహితులు రూ.2 లక్షలతో కళాశాలలో బోరును, 2004 బ్యాచ్‌లో స్నేహితులుగా మారిన మరికొందరు రూ.4 లక్షలతో కళాశాలలోని ఈఎన్‌టీ విభాగానికి అవసరమైన వైద్య పరికరాలను అందజేశారు. కళాశాల హితంకోరే స్నేహితులుగా స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.


రూ. 15 లక్షలతో రెండు గదుల నిర్మాణానికి చేయూతనిచ్చిన (1987, 1995 బ్యాచ్) స్నేహితుల బృందం


రూ.2 లక్షలతో 1993 బ్యాచ్ విద్యార్థులు కళాశాలలో బోరు వేయిస్తున్న దృశ్యం

దారి తప్పితే దండన తప్పదు

● నేర సమీక్షలో ఎస్పీ హెచ్చరిక



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేసేవారు దారితప్పి ప్రవర్తిస్తే దండన తప్పదని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో శనివారం జిల్లా స్థాయి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆరు నెలలతో పోలిస్తే గ్రేవ్ కేసులు, దొంగతనాలు కొంత తగ్గుముఖం పట్టాయని ఎస్పీ చెప్పారు. తీవ్ర నేరాల కేసుల(గ్రేవ్) ఛేదన సమయంలో ప్రణాళికాబద్ధంగా వెళితే సులువుగా ఫలితాలు రాబట్టవచ్చన్నారు. నెలాఖరులోగా పెండింగ్ గ్రేవ్ కేసుల విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసులు పూర్తి స్థాయిలో విచారించాక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసుల విచారణకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఇళ్ల చోరీ కేసులు తగ్గుముఖం పట్టాయని, ఇటీవల దాదాపు 75 మంది పాత నేరస్థులను అరెస్టు చేశామని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వైట్ కాలర్, సైబర్ క్రైం నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డీపీడీ, దారి దోపిడీ కేసుల పెండింగ్‌పై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంధ్య, కేదారినాథ్, జయశేఖర్, ప్రేమసాగర్, నిర్మల, కుమారి, శిరీష, అదనపు ఎస్పీలు రామకృష్ణ, రవిమనోహరాచారి, వెంకట్రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో జాతీయ పతకాలు

వడమాలపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేట ఉన్నత పాఠశాల క్రీడాకారులు వెండి పతకాలు సాధించారు.జూలై 26 నుంచి 30వ తేదీ వరకు జాతీయ గ్రాప్లింగ్, రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్పూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చేతన్ సాయి(9వ తరగతి) 50 కిలోల విభాగంలో, ప్రణతి(8వ తరగతి) 34 కిలోల విభాగంలో ప్రతిభ చూపి వెండి పతకాలను సాధించారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రాణం తీసిన ఈత సరదా


అక్షిత్(ఫైల్ ఫొటో)

వెంకటగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసిన ఘటన పట్టణంలోని అమ్మవారిపేట చెరువులో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని అరవ పాళెంకు చెందిన అరవ మధు, మోహనమ్మ కుమారుడు అక్షిత్(13) స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలలో భోజనం తర్వాత స్నేహితులతో కలిసి అమ్మవారిపేట చెరువులో ఈతకు వెళ్లాడు. ఈతకొట్టే క్రమంలో విద్యార్థులు ప్రమాదంలో ఉండటంతో స్థానికంగా చేపలు పట్టేవారు గమనించి కాపాడారు. అక్షిత్ కనిపించకపోవడంతో స్కూల్‌కు వెళ్లిపోయి ఉంటాడని భావించి అందరూ మిన్నకుండిపోయారు. సాయంత్రమైనా ఆ బాలుడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు పాఠశాల ప్రిన్సిపాల్‌ను విచారించారు. అందరూ కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం చెరువు వద్ద పరిశీలించగా అక్షిత్ మృతదేహం తేలుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్యూటీలు వేయకుండా సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడు

● అటెండర్ తిరుమలేష్ ఆరోపణ

రేణిగుంట ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డ్యూటీలు వేయకుండా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ వేధిస్తున్నాడని ఆ కార్యాలయ అటెండర్ తిరుమలేష్ ఆరోపించారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతి విలేకరితో మాట్లాడుతూ కార్యాలయంలో తాను చేయాల్సిన పనులను ప్రైవేటు వ్యక్తుల చేత చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు రికార్డు రూమ్‌లోని బీరువా తెరిచి రికార్డులను పరిశీలిస్తుంటారని, డాక్యుమెంట్ నెంబర్లు రాస్తుంటారని తెలియజేశారు. తనకు తపాలా విధులు ఇచ్చి ప్రైవేటు వ్యక్తుల చేత ఎలా పనిచేయించారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డిని వివరణ కోరగా విధుల్లో భాగంగా అప్పగించిన పనులను సిబ్బంది చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే సిబ్బంది కొరతతో ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించుకుంటున్నామని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన సెల్వరాజ్

వరదయ్యపాళెం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మండలంలోని పెద్దపాండూరు గ్రామానికి చెందిన సెల్వరాజ్ (22) శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తుంటాడు.శనివారం రాత్రి విధులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా నక్కలమిట్ట వద్ద అదుపు తప్పి బోల్తా పడ్డాడు. తీవ్ర గాయాల పాలైన అతడిని వెంటనే స్థానికులు సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి


మృతుడు వరదయ్య

వడమాలపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాదిరేడు బైపాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. మరో మహిళ తీవ్ర గాయాలపాలైంది. పాదిరేడుకు చెందిన వరదయ్య(65) వడమాలపాట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు బైపాస్ రోడ్డు దాటు తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న లారీ ఢీకొంది. వరదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న వసంతకు చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడింది. 108లో వారిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వరదయ్య మృతిచెందాడు. వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ స్నాతకోత్సవం

● హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి



విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న సతీష్‌రెడ్డి

సత్యవేడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీలో శనివారం 9వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జీ.సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వీ.కార్తికేయన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల గవర్నింగ్ బోర్డు సభ్యులు, శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, సెనేట్ సభ్యులు హాజరయ్యారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీ కోయంబత్తూరు టెక్స్‌టైల్స్ లాంటి పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందన్నారు. ఇక్కడ విద్యా, పారిశ్రామిక వ్యవస్థ కలిసి అభివృద్ధి చెందడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రయోజనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కార్తికేయన్ వార్షిక నివేదికను సమర్పించారు. విద్య, పరిశోధన, క్రీడా రంగాలలో సంస్థ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో 309 మందికి బీటెక్ పట్టాలను, 9 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. వీరిలో 18 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పట్టాలు ప్రదానం చేయగా మరో ముగ్గురికి బంగారు పతకాలు అందించారు.

ఘనంగా ఎంబీయూ స్నాతకోత్సవం

చంద్రగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం(ఎంబీయూ)లో శనివారం కాన్వకేషన్, గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు అధ్యక్షతన ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్, విశ్వహిందీ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ అందరూ గొప్పవారు కాలేరని, కష్టపడేతత్వం కలిగిన వారే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారనిన్నారు. ఎంబీయూ ఛాన్సలర్ మోహన్ బాబు మాట్లాడుతూ ప్రఫుల్ పటేల్ గొప్ప విద్యావేత్త అని కొనియాడారు. మహారాష్ట్రకు చెందిన లోక్మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్డా విద్యావేత్తగా, నేషనల్ కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రిగా చేసిన సేవలను గుర్తుచేశారు. ఎంబీయూ ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీవిద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 1698 మందికి గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకున్నట్లు తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు, డ్రమ్స్ శివమణితో పాటు మహారాష్ట్రకు చెందిన లోక్మత్ పత్రిక అధినేత విజయ్ జవహర్ దార్ధాకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. దేశంలోనే ప్రముఖ వ్యక్తులకు డాక్టరేట్ ఇచ్చామని ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ సారథి, డీఎస్‌ఏ రవిశేఖర్, సీజీఎస్ఐ వికాస్ సింగ్, డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.


శివమణికి గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న మోహన్‌బాబు

బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

● అధికారులకు సీవీఎస్వో ఆదేశం

తిరుమల, ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రానున్న బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 24 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయన విజిలెన్స్, ఫైర్, ఎస్పీఎఫ్ అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం సమావేశమయ్యారు. సీవీఎస్వో మాట్లాడుతూ.. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా తిరుమలలోని ప్రతి ప్రాంతంపైనా నిఘా ఉంచుతూ భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు సీఎం పట్టువస్త్రాల సమర్పణ నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా గ్యాలరీలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ప్రణాళికబద్ధంగా రూపొందించాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.



డీఐజీ గోపీనాథ్ జెట్టికి పితృవియోగం

ఓజిలి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): డీఐజీ గోపీనాథ్‌జెట్టి తండ్రి జెట్టి పుల్లయ్య (72) శుక్రవారం రాత్రి తిరుపతిలో మృతి చెందారు.ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఓజిలి మండలం కరబల్లవోలుకు శనివారం తీసుకువచ్చారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఓజిలి మండలం సగుటూరు ఎంపీటీసీగా పుల్లయ్య సేవలు అందించారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు ఐపీఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం సందర్శించి నివాళులర్పించారు. కరబల్లవోలులోనే ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

బళ్లారి రాఘవకు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారుడు బళ్లారి రాఘవాచారికి డీఆర్వో నరసింహులు ఘన నివాళి అర్పించారు. రాఘవాచారి జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ రాఘవాచారి తెలుగు నాటక రంగానికి విశేష సేవలు అందించారని తెలిపారు.

కానిస్టేబుల్ పరీక్షల్లో.. వికసించిన పేదింటి కుసుమం


రిచా

కేవీబీపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి: వారిది పేద కుటుంబం. తండ్రి లేడు. తల్లి కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డలను చదివించింది. గత ఏడాది కుమారుడు సూర్య ఆర్మీకి ఎంపికయ్యాడు. ఇప్పుడు కుమార్తె రిచా కానిస్టేబుల్‌గా ఎంపికైంది. శుక్రవారం విడుదలైన కానిస్టేబుల్ రాత పరీక్ష ఫలితాల్లో ప్రతిభకనబరిచిన మండలంలోని రాయపేడు గ్రామానికి చెందిన మేరీ కుమార్తె రిచాను గ్రామస్తులు అభినందించారు. పట్టుదలతో అన్నాచెల్లెలు ఉద్యోగాలు సాధించారంటూ కొనియాడారు.

సెప్టెంబరు 25 వరకు ప్రత్యేక రైళ్ల కొనసాగింపు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖపట్నం మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు సెప్టెంబరు 25వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో తెలిపారు. ఈ ప్రత్యేక రైలు(08547) విశాఖపట్నంలో ప్రతి బుధవారమూ బయలుదేరుతుందని, ఈ ప్రత్యేక రైలు(08548) తిరుపతిలో ప్రతి గురువారమూ బయలుదేరి రాకపోకలు సాగిస్తుందని వివరించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తిన్నెలపూడిలో వెలగని వీధిలైట్లు
రెండు వారాలుగా అంధకారం



వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులే ఏర్పాటు చేసుకున్న లైట్

కోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ తిన్నెలపూడిలోని కొన్ని వార్డులు అంధకారంలో ఉన్నాయి. తిన్నెలపూడిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి సచివాలయం మీదుగా ఆంజనేయస్వామి విగ్రహం వరకు 1వ వార్డు పరిధిలో ఉంటుంది. ఈ వార్డులోని ఇళ్లకు వీధిలైట్లకు సంబంధించిన ఫేజు క్యారియర్ మరో వార్డులో అమర్చారు. అక్కడ వీధిలైట్ల నిర్వహణ చూసే ఉద్యోగి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఫేజు క్యారియర్ తీసివేస్తుండడంతో వీధుల్లో అంధకారం నెలకొంటోంది. రాత్రి పూట పాములు, తేళ్లు, జెర్రెలు సంచరిస్తుండడంతో వీధుల్లో తిరగాలంటే ప్రజలు యపడుతున్నారు. అంతే కాకుండా దొంగల బెడద అధికంగా ఉండడంతో స్థానికులను భయాందోళన చెందుతున్నారు. ఇటీవల సమీప పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేసేందుకు వెళ్లిన దొంగల్లో ఒకరు ప్రమాదవ శాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. రాత్రిపూట పోలీసు గస్తీలు లేకపోవడంతో తిన్నెలపూడి ప్రజలు భయంగుప్పెట్లో ఉన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి 1వ వార్డులోని వీధి లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రానికి పెద్దదిక్కు చంద్రబాబే: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే రాష్ట్రానికి పెద్ద దిక్కు అని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుతో స్వర్ణయుగాన్ని చూస్తున్నారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఏఎంసీ గోడౌను ఆవరణలో అన్నదాత సుఖీభవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పెట్టే రైతన్న ముఖంలో సంతోషం చూస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం దశల వారీగా అములు చేస్తుందని చెప్పారు. అన్నదాత సుఖాభవ పథకం మొదటి విడతలో రైతులకు రూ.7వేలు జమ చేస్తున్నానిమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తనూజరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధరం, వ్యవసాయశాఖ ఏడీ అనుసూయ, డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి ఏవోలు శిరీష, సుజాత, విజయలక్ష్మి, డక్కిలి, వెంకటగిరి తహసీల్దార్లు నరిసింహులు, శ్రీనివాసులు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నాయకులు అవ్వారు సత్యనారాయణ, సీసీ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, మల్లారం బాబు, జీకేపల్లి బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనాన్ని పెంపొందించాలి

గూడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని రోటరీ వెస్ట్‌క్లబ్ సభ్యులు అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ మొక్కలను పెంచడం వల్ల పర్యావరణాన్ని కాపాడు కోవచ్చున న్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ భాస్కర్ రెడ్డి, రాఘవరెడ్డి, వాసు, బొమ్మిడి శ్రీనివాసులు, సనత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, గిరిబాబు, కృష్ణం రాజు, కృష్ణారెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

తడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దారు శరత్‌బాబు వీఆర్వోలను ఆదేశించారు. శనివారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తడకండ్రిగలో పాడుబడిపోయిన కోనేరును సర్వేచేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో వీఆర్వోలు బాబు, చలపతిరావు, జ్ఞానయ్య, లలిత, సర్వేయర్లు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గూడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అన్నారు. శనివారం పాఠశాల ఆధ్వర్యంలో పట్టణంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరివిగా మొక్కలను పెంచి సంరక్షించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో భవానీ, సునీల్, పద్మయ్య, మల్లికార్జున, ప్రసాద్, శశి, సంధ, శివరంజని, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

కోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్లపూడి సమీపంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. రెండు కోళ్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్

వాకాడు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వాకాడు తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ తహసీల్దారుగా విధులు నిర్వహించిన రామయ్య సస్పెండ్ అవడంతో సయ్యద్ ఇక్బాల్‌ను నియమించారు.

గురుకులంలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు.

అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించకుంటే చర్యలు తప్పవు

నాయుడుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె పర్యటించి అక్రమ కొళాయి కనెక్షన్లదారులతో మాట్లాడారు. డిపాజిట్‌తో పాటు మూడేళ్ల నీటి పన్ను చెల్లించి అక్రమ కొళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో కొళాయి కనెక్షన్ తొలగించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.





కారిజాత చెరువులో మట్టి తవ్వేయడంతో ఏర్పడిన గుంతలు - రాత్రిపూట మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చెరువులనూ తవ్వేస్తున్నారు!

- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- వైసీపీ హయాంలో చెలరేగిన అక్రమార్కులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా మారనితీరు
- యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డివిజన్ కేంద్రంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. చీకటి పడితే చాలు మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిపోయిన అక్రమార్కులు కూటమి ప్రభుత్వం వచ్చినా తగ్గడం లేదు. ఇటీవల కారిజాత, కుదిరి, కోటపోలూరు చెరువుల్లో జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇదంతా పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతందనే ఆరోపణలు ఉన్నాయి.సూళ్లూరుపేట మండలం కుదిరి, కోటపోలూరు చెరువులతో పాటు, తడ మండలం కారిజాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు పెరిగిపోయాయి. చీకటి పడితే కారిజాత చెరువులో ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా సూళ్లూరుపేట పట్టణంలోని కొత్త వెంచర్లు, ఇళ్ల ప్లాట్లకు తరలిస్తున్నారు. చీకటి పడితే చాలు కారిజాత చెరువు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తీసుకుని దావాదిగుంట, షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్‌పాలెం మీదుగా షార్ రోడ్డులో మట్టిని తరలిస్తున్న సంబంధిత అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని తవ్వి అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. చెరువులను కాపాడాల్సిన నీటి సంఘ అధ్యక్షుడు అక్రమార్కులతో చేతులు కలిపి మౌనంగా ఉండిపోతున్నారు. గత వారం రోజుల నుంచి కారిజాత చెరువులో పది అడుగుల మేర మట్టిని తవ్వి వెంచర్లకు తరలిస్తున్నారు. మట్టి అక్రమ రవాణాపై గ్రామస్తులు పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. కాళంగి నది నుంచి ఇసుక అక్రమ రవాణా నిషేధం ఉన్నా అక్రమార్కులు నిత్యం తవ్వి డంపింగ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైతుల క్షేమమే ధ్యేయంగా పాలన: పాశిం

గూడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల క్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాగణంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన చెక్కును రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా మొదటి విడతగా రూ.7వేల నగదును రైతుల ఖాతాలో జమచేయడం జరిగిందన్నారు. రెండో విడత అక్టోబరు, మూడో విడత నగదును జనవరిలో జమ చేయడం జరుగుతుందన్నారు. మొతంతం ఏడాదికి రైతులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను రూ.1000 పెంచి అందించడంతో పాటు తల్లికివందనం, దీపం పథకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ అమలు చేయడం జరిగిందన్నారు. ఈనెల 15నుంచి మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణ సదుపాయాన్ని కల్పించనున్నామన్నారు. పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలోని 22,217 మంది రైతులకు రూ.14.91 కోట్లు వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, బిల్లుచెంచురామయ్య, మట్టం శ్రావణి, రవీంద్రరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, లీలావతి, వాటంబేడు శివకుమార్, కిషోర్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్, గోపినాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

ఆస్పత్రి, గురుకుల పాఠశాలలో తనిఖీలు



ప్రభుత్వాస్పత్రిలో పరికరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి విష్ణువర్మ

వెంకటగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి రోగులకు వైద్యం సక్రమంగా అందడం లేదని, బీసీ గురుకుల పాఠశాలలో వసతులు సరిగా లేవని ఫిర్యాదులు అందడంతో వెంకటగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ న్యాయవాదులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. తొలుత ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన ఆయన వైద్యం సక్రమంగా అందుతోందా లేదా అని రోగులతో మాట్లాడి ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా... మందులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వసతులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం న్యాయమూర్తి బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. మెనూను పరిశీలించారు. చాలినంత భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం గమనించిన వాటిని మరమ్మతులు చేసి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు వసతి గదులు సక్రమంగా లేవని తల్లిదండ్రులు చెప్పడంతో ఈ విషయాన్ని సంబందిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వసతులు మెరుగుపడేలా చూస్తామన్నారు. ఆయన వెంట న్యాయవాదులు రాజారాం, సుంకర రాజేష్ తదితరులు ఉన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం: విజయశ్రీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన ఆర్డీవో కిరణ్మయి, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ఆర్డీవో కిరణ్మయితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు అందించే పెట్టుబడి సాయం తొలి విడత విడుదల చేసిన నగదు చెక్కులను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. అలాగే రైతులకు విత్తనాలు, సబ్సిడీతో మంజూరైన డ్రోన్లను అందజేశారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు.సూపర్ సిక్స్ పథకాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడం జరిగిందని, ఈనెల 15నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. అలాగే కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పించన్లను తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏవోలు కాంచన, జ్యోతిర్మయి, గణేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు, కామిరెడ్డి మురళీరెడ్డి, బీజేపీ నాయకులు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, విజయమ్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ప్రభుత్వం

నాయుడుపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట గాంధీమందిరం వద్ద శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నగదును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, గూడూరు ప్రభావతమ్మ, నెలవల రాజేష్, శ్రీరామ్ ప్రసాద్, కట్టా వెంకటరమణారెడ్డి, అవధానం సుధీర్, మైలారి రాజశేఖర్, పసల గంగాప్రసాద్, సుజాతమ్మ, మధుసూదనరెడ్డి, సంచి కృష్ణయ్య, కరుణాకర్‌రెడ్డి, పొట్లపూడి రాజేష్, అంకయ్య పాల్గొన్నారు.

చిల్లకూరు పీఏసీఎస్ చైర్మన్‌గా రామచంద్రారెడ్డి



రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

చిల్లకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా చిల్లకూరు గ్రామానికి చెందిన కొండా రామచంద్రారెడ్డి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే పీఏసీఎస్ సభ్యులుగా ఏరూరు గ్రామానికి చెందిన దర్శి రమణయ్య, వడ్డికండ్రిగకు చెందిన ఇరగ వీరరాఘయ్య నియమితులయ్యారు.పీఏసీఎస్ సీఈవో రాజనేని రామయ్యనాయుడు, సిబ్బంది రామచంద్రారెడ్డి నివాసంలో ఆయనను కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

తిమ్మానాయుడుపాళెంలో సుపరిపాలనలో తొలిఅడుగు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మానాయుడు పాళెం పంచాయతీలో శనివారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ సీనియర్ నాయకుడు మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పలువురికి పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగభూషణం పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

చిల్లకూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం లో స్వామి, అమ్మవార్లకు శని వారం అభిషకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యే కంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. ఆలయ ప్రాగణంలో ఊరేగించారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

గూడూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలను దోచుకుని, కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శివకుమార్, శశికుమార్, బీవీ రమణయ్య, మణి, చంద్రయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

సూళ్లూరుపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా సీపీఐ జిల్లా మహాసభలు ఆదివారం నుంచి రెండో రోజుల పాటు జరగనున్నాయి. తొలిరోజు ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద జరిగే బహిరంగ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో పాటు పలువురు సీనియర్ నేతలు విచ్చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆ పార్టీ నాయకులు చేస్తున్నారు.

బస్టాండ్‌లో సెల్‌ఫోన్ చోరీ యత్నం
నిందితుడిని పోలీసులకు పట్టించిన ప్రయాణికులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ చోరీకి పాల్పడ్డారు. ప్రయాణికులు ఒకరిని పట్టుకొని సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

బాలాయపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని సీడీపీవో షంషద్ బేగం అన్నారు. మండలంలోని వెంగమాంబపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లి ప్రసవం నుంచి త్వరగా కోలుకుంటుందన్నారు. అంతేకాకుండా డయాబెటిస్, క్యాన్సర్ ప్రమాదాలు తగ్గుతా యన్నారు. తల్లి పాలతో బిడ్డకు సరైన పోషణ అందడంతో పాటు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ వినూష, మహిళా పోలీస్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: మండలంలోని చెన్నూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సీడీపీవో మెహబూబీ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టకరమైనవని అన్నారు. పుట్టిన బిడ్డలకు తల్లి ముర్రుపాలు అందించడం ద్వారా బిడ్డలలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో శివజ్యోతి, ప్రసన్న, జ్యోతి, కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చిట్టమూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. శనివారం చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఎంఈవో కృష్ణయ్య పాఠశాల విధివిధానాల మార్పులను తెలియజేశారు. ఉపాధి, వెలుగు, ఇరిగేషన్, ఐసీడీఎస్ అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేకూరనివారు తహసీల్దారు కార్యాలయంలో సరి చేయించుకోవాలని డీటీ నిరంజన్ కుమార్ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వెంకటరమణయ్య, సుబ్బమ్మ, జట్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, హౌసింగ్ ఏఈ సుధీర్, కోట ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేద్దాం

కోట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు సాగే రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేద్దామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, మాలల జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులు మీజూరు మాధవ్, పాలా మల్లికార్జున్, పనబాక హేమంత్, కోటేశ్వరరావు, అశోక్‌కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.